ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శనివారం అక్టోబరు 5, 2024

వేదమూర్తి.. విశ్వదీప్తి



ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి, భవానీపురం, చిట్టినగర్

ఇంద్రకీలాద్రిపై దసరా వేడుకలు రెండో రోజు ఘనంగా జరిగాయి. దుర్గమ్మ శ్రీగాయత్రీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. శుక్రవారం కావడంతో ఉదయం నుంచి క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజామున 4 గంటల నుంచి దర్శనాలకు అనుమతించారు. రాత్రి 11గంటల వరకూ దర్శనాలు కొనసాగాయి. రెండో రోజు 80 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చి శ్రీగాయత్రీదేవి రూపంలోని అమ్మవారిని దర్శించుకున్నారు. మొదటి రోజు ప్రసాదాలు, దర్శనాలు, పూజల ద్వారా రూ.28 లక్షల ఆదాయం ఆలయానికి సమకూరినట్టు అధికారులు ప్రకటించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీలు కేశినేని శివనాథ్, సీఎం రమేష్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. క్యూలైన్లలో నడిచి.. రెండు కిలోమీటర్ల దూరం వస్తుండడంతో వారికి మధ్యలో మంచినీటి బాటిళ్లు, పిల్లలకు వేడి పాలు అందజేస్తుండడంపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


క్యూలైన్లలో భక్తులు



నేడు అన్నపూర్ణాదేవిగా దర్శనం..
దుర్గమ్మ ఉత్సవాల మూడో రోజు శనివారం అన్నపూర్ణాదేవి రూపంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమివ్వనుంది.
సమయం: ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు

✸ సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టామని కలెక్టర్ సృజన వెల్లడించారు. క్యూలైన్లలో వస్తున్న భక్తులతో ఆమె మాట్లాడారు. దర్శనం ఆలస్యం అవుతోందని కొందరు భక్తులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అధికారులతో మాట్లాడి.. ఎందుకు ఆలస్యం అవుతోందని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం కావడంతో రద్దీ ఎక్కువగా ఉందని దుర్గగుడి అధికారులు తెలిపారు. ఆలస్యం జరగకుండా దర్శనాలు చేసుకునేలా చక్కదిద్దాలని ఆమె సూచించారు.


కలెక్టర్ సృజనకు అమ్మవారి పటం అందిస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు

స్తంభించిన ఖాతాల స్థానంలో ప్రత్యామ్నాయం

ఈనాడు, అమరావతి: సాంకేతిక కారణాలతో పనిచేయని బ్యాంకు ఖాతాల స్థానంలో ప్రత్యామ్నాయ ఖాతాలకు వరద బాధితుల పరిహారాన్ని జమ చేస్తున్నామని కలెక్టర్ జి.సృజన వెల్లడించారు. అలాంటి ఖాతాలు 4 వేలు గుర్తించి సొమ్ము జమ చేశామనీ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పరిహారం అందిస్తామని స్పష్టం చేశారు. పరిహారం కోసం సచివాలయంలో దరఖాస్తు చేస్తే చాలనీ.. వ్యయ ప్రయాసలకు ఓర్చి కలెక్టరేట్‌కు రావద్దన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందుతుందని భరోసా ఇచ్చారు. అర్హత లేని వారికి ఎన్ని సిఫార్సులు చేసినా పరిహారం సాధ్యం కాదన్నారు. బాధితుల గుర్తింపు ప్రహసనంగా మారింది. ఇప్పటికే 85 వేల మందికి పరిహారం ఇచ్చినా.. కలెక్టరేట్‌కు ఇంకా 21 వేల దరఖాస్తులు రాగా విచారణ జరుగుతోంది. నివాస ధ్రువపత్రాలు చూపితే చాలు.. అర్హులుగా ఎంపిక చేస్తున్నారు. ఏ ఆధారం లేకపోతే తామేం చేయగలమని కలెక్టర్ సృజన పేర్కొన్నారు. శుక్రవారం ఆమె 'ఈనాడు'తో మాట్లాడారు.

ఆందోళన చెందవద్దు: బాధితుల బ్యాంకు ఖాతాలు 16 వేల వరకు వివిధ కారణాలతో స్తంభించాయి. అలాంటి వాటికి ప్రత్యామ్నాయం చూడాలని సూచించాం. శుక్రవారం 4 వేల ఖాతాలను గుర్తించారు. మరో ఖాతా కానీ.. వారి పిల్లల ఖాతాలో కానీ (మైనర్లు) నగదు జమ చేశాం. మరో 12 వేల ఖాతాలను గుర్తించి శనివారం జమ చేయనున్నాం. అకౌంట్ పే కిందనే జమ చేస్తున్నాం. ✪ దాదాపు 21 వేల మంది దరఖాస్తు చేశారు. అన్నింటిని సచివాలయ సిబ్బందితో రీ వెరిఫికేషన్ చేయిస్తున్నాం. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం వాటిలో 10 వేల మందికి పరిహారం చెల్లించాం. మళ్లీ ఎందుకు దరఖాస్తు చేశారో తెలియదు. ఆవిషయాన్ని వారికి స్పష్టంగా తెలియజేస్తున్నాం. ప్రభుత్వ లేఖలు అందిస్తున్నాం. మిగిలిన వాటిపై క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నాం. ఒకే ఇంటిలో వేర్వేరు కుటుంబాలని దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలన చేయిస్తున్నాం. కనీసం నివాసం ఉంటున్న ఆధారం ఉండాలి. నివాస గృహాల మ్యాపింగ్ జరిగింది. రేషన్‌కార్డు ఆధారంగా చేశారు. వాటి వివరాలు ఉండాలి. కరెంటు బిల్లు, గ్యాస్ బిల్లు, ఇతర ఆధారులు ఏది ఉన్నా.. పరిగణనలోకి తీసుకుంటున్నాం. నివాస ధ్రువీకరణ లేకుండా, ఆధారాలు చూపకుండా చేసిన దరఖాస్తులు ఎక్కువ ఉన్నాయి. ప్రభుత్వానికి నివేదిస్తాం. పరిశీలన పూర్తయి అర్హులైన వారికి జాబితా ప్రకారం పరిహారం అందజేస్తాం. మిగిలిన వారి విషయంలో ప్రభుత్వ నిర్ణయం ప్రకారం చర్యలు ఉంటాయని' అని కలెక్టర్ సూచించారు.


గాయత్రి దేవికి ప్రత్యేక పూజలు



నగరోత్సవ సందడి


మంగళహారతికి ప్రణామం


భక్తుల సామూహిక కుంకుమార్చన


ఊరేగుతున్న ఉత్సవమూర్తులు


జగన్మాత దర్శనానికి తరలివస్తూ...


కొండంత వెలుగు : అలరించిన లేజర్‌షో

వేద మాత.. వర ప్రదాత


అదిగదిగో దుర్గమ్మ


తల్లీ వందనం

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ శుక్రవారం గాయత్రీదేవిగా భక్తులను అనుగ్రహించారు. ఉదయం నుంచే క్యూలైన్లలో భక్తులతో నిండిపోయాయి. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. మల్లికార్జున మహామండపంలో కుంకుమ పూజలు కొనసాగాయి. సాయంత్రం ఆది దంపతుల నగరోత్సవం నయన మనోహరంగా సాగింది. గంగా, పార్వతీ సమేత దుర్గామల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులను అలంకరించిన పల్లకీలో ఉంచి రుత్వికులు పూజ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

- ఇంద్రకీలాద్రి, భవానీపురం, చిట్టినగర్, కృష్ణలంక


సకుటుంబ సమేతంగా కుంకుమార్చన


జగమేలు తల్లికి హారతి


భరతవేదమున..

రైల్వే ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేయాలి

దక్షిణ మధ్య రైల్వే జీఎంకు ఎంపీల విన్నపం

ఈనాడు డిజిటల్ - అమరావతి: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో రైల్వే ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్‌లు ఇది వరకే ప్రాజెక్టుల నివేదికలు దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌కు సమర్పించారు. వీటిలో గుడివాడ, మచిలీపట్నం, విజయవాడ, భీమవరం, సవారీగూడెం, వీరవల్లి సెక్షన్లలో ఆర్వోబీల నిర్మాణం, ఎల్‌సీ నం.338లో ఆర్‌యూబీ నిర్మాణం, బందరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ, మోడల్ రైల్వేస్టేషన్‌గా మార్పు, విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి నిధులు, పశ్చిమ పరిధిలో వరద ముంపునకు గురికాకుండా వించిపేట, పాత రాజరాజేశ్వరిపేట, కబేళా, కేఎల్‌రావు నగర్ తదితర ప్రాంతాల్లో డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలని ఎంపీలు నివేదికలు సమర్పించారు. శుక్రవారం నగరంలోని రైల్వే ఈటీటీసీ కేంద్రంలో రాష్ట్రంలో రైల్వే పెండింగ్ ప్రాజెక్టులపై దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌తో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ.. విజయవాడను డ్రెయినేజీ సమస్య తీవ్రంగా వెంటాడుతోంది. ఇటీవల వర్షాలకు, బుడమేరు వరదకు నగరం అతలాకుతలమైంది. నగరంలో డ్రెయినేజీ శాశ్వత పరిష్కారానికి రైల్వే, రెవెన్యూ, నగరపాలక సంస్థ అధికారులతో జాయింట్ కమిటీ వేయాలని కోరారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, తప్పిదాల వల్లే రాష్ట్రంలో రైల్వే వ్యవస్థ వెనుకబడిందన్నారు. రైల్వే జీఎం అరుణ్‌కుమార్ కూడా జాయింట్ కమిటీ వేయనున్నట్లు చెప్పారు.


మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

ఎంబీబీఎస్ యాజమాన్య కోటా రెండో విడత కౌన్సెలింగ్ సీట్ల భర్తీ

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్ యాజమాన్య కోటా సీట్ల ప్రవేశానికి రెండో విడత కౌన్సెలింగ్ సీట్లన్నీ భర్తీ అయ్యాయి. ఈ మేరకు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నియామకాలను శుక్రవారం విడుదల చేసింది. రాష్ట్రంలోని 6 ప్రభుత్వ కళాశాలలోని సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లలో 'బి' కేటగిరీలో 32, ఎన్నారై కోటా 15 సీట్లతో పాటుగా 17 ప్రైవేటు వైద్య కళాశాలల్లో బి1 కేటగిరీలో 77, బి2 కేటగిరీలో 117, సి కేటగిరీలో 110 సీట్లకు గాను 5 సీట్లు మిగిలి ఉన్నాయి. మైనారిటీ వైద్య కళాశాలలో బి కేటగిరీలో 30 సీట్లు భర్తీ కాగా, సి కేటగిరీలో 20 సీట్లు మిగిలాయి. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా వైద్య కళాశాలల్లో ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా చేరాల్సి ఉంటుంది. ఈనెల 14వ తేదీ నుంచి మొదటి విద్యా సంవత్సరం ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

పోలీసుల అత్యుత్సాహం.. సిబ్బంది అవస్థలు!

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో కొందరు పోలీసుల అత్యుత్సాహం విధి నిర్వహణలో ఉన్న ఇతర శాఖల సిబ్బందిని అవస్థల పాలు చేస్తోంది. పోలీసుల తరహాలోనే ఇతర విభాగాల సిబ్బంది అధికారులు దసరా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జగన్మాత దుర్గమ్మ దర్శనానికి వస్తున్న సమయంలో ఆయన వెంట ఉన్న గన్‌మెన్‌ను ఆగమని ఏడీసీపీ రామకృష్ణ ఆదేశించారు. తను టికెట్ తీసుకున్నానని.. వెళ్తానని చెప్పినా అంగీకరించలేదు. ఈ విషయాన్ని గన్‌మెన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గన్‌మెన్ వద్ద ఎటువంటి ఆయుధం లేనప్పటికీ దర్శనానికి ఎందుకు అడ్డుకున్నారని ఎమ్మెల్యే ప్రశ్నించినట్లు సమాచారం.

ఏఈతో డీఎస్పీ దురుసు ప్రవర్తన : క్షేత్రస్థాయి పోలీసులకు సరైన అవగాహన లేకపోవడంతో ఇతర శాఖల అధికారులు, సిబ్బందిని పలు పాయింట్ల వద్ద ఆపడంతో వివాదాలు తలెత్తుతున్నాయి. ఇంజినీరింగ్, విద్యుత్తు, దేవస్థానం ఉద్యోగులు, అర్చకులు, సేవలు అందించేందుకు వచ్చిన వారితో నిత్యం ఇక్కడ వివాదాలు జరుగుతున్నాయి. కనకదుర్గానగర్‌లో రాత్రి వేళ విధులు నిర్వహిస్తున్న ఏఈ మస్తాన్‌ను బందోబస్తు నిమిత్తం వచ్చిన డీఎస్పీ అడ్డుకున్నారు. ఆ సమయంలో ఈఈ రమాదేవి విధులు ముగించుకొని వెళ్తుండగా కలిసేందుకు వచ్చిన ఏఈని డీఎస్పీ అడ్డుకొని అతడి వద్దనున్న వాహన తాళాన్ని లాగేసుకున్నారు. వారి మధ్య వాగ్వాదం జరిగింది. డీఎస్పీ తనను ఇష్టం వచ్చినట్లు దూషించినట్లు ఈఈ రమాదేవి వద్ద వాపోయారు. ఈఈ రమాదేవి కారు దిగివచ్చి విషయం చెప్పినా డీఎస్పీ వినిపించుకోలేదు. దీంతో ఆమె విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పశ్చిమ ఏసీపీ దుర్గారావు ఘటనా స్థలానికి చేరుకొని జరిగిన విషయాన్ని సీపీ రాజశేఖర్‌బాబుకు వివరించడంతో సదరు డీఎస్పీని కనకదుర్గానగర్ బందోబస్తు విధుల నుంచి శుక్రవారం తప్పించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)


వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 595 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

నాన్నా ఒక్కసారి లే..

క్వారీ గుంతలో గల్లంతైన తండ్రి మృతదేహం వద్ద కుమార్తె రోదన


నాగరాజు(పాతచిత్రం)

గొల్లపూడి, న్యూస్‌టుడే: నాన్నా లే ఒక్కసారి అంటూ.. కొత్తూరు తాడేపల్లిలోని మట్టి క్వారీలో నిలిచిన నీటిలో గల్లంతైన యువకుడు కూరపాటి నాగరాజు(28) మృతదేహం వద్ద అతడి కుమార్తె విలపించడం చూపరులకు కంటతడిపెట్టించింది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూరపాటి నాగరాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. అతనికి భార్య, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. భార్య స్థానికంగా ఉన్న ఒక దుకాణంలో పని చేస్తుంటుంది. వాళ్లకు గ్రామ శివారులో కొంత వ్యవసాయ భూమి ఉండగా నాగరాజు సాగు చేస్తుంటాడు. ఈ నెల 3 వ తేదీన పొలం చూసి వస్తానంటూ ఇంట్లో చెప్పి వెళ్లి సోదరుడు సుబ్బారావుకు ఫోన్ చేసి మాట్లాడుతుండగా ఒక్కసారిగా కాల్ కట్ అయింది. దీంతో నాగరాజు కోసం సోదరుడు వెతుకుతుండగా అంబేడ్కర్ కాలనీ శివారులో ఉన్న మామిడి పొలాల వద్ద ఉన్న క్వారీ గొయ్యి వద్ద చరవాణి పడి ఉంది. చెప్పులు నీటిలో తేలుతున్నాయి. దీంతో పోలీసులకు, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలకు సమాచారం ఇవ్వగా వాళ్లొచ్చి క్వారీ నీటిలో గాలించి శుక్రవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించి శవపంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. ప్రమాదవశాత్తు మట్టి క్వారీ నీటిలో పడి తన కుమారుడు చనిపోయాడంటూ తల్లి సీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ


మైలవరం: ఎంపీడీవోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీపీ, కార్యాలయ సిబ్బంది

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా పి.అనూరాధ శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల అనంతరం జి.కొండూరు ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆమెను తాజాగా మైలవరానికి బదిలీ చేశారు. ఎంపీపీ ప్రసన్నరాణి, మైలవరం ఈవోపీ రవి, కార్యాలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా జి.కొండూరు ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న పి.అనూరాధ శుక్రవారం కార్యాలయంలో మైలవరం, ఈవోపీఆర్డీ జి.భారతి గన్నవరం మండలం బదిలీపై వెళ్లారు. దీంతో ఇబ్రహీంపట్నం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న బి.వి. రామకృష్ణనాయక్, రాజానగరంలో విధులు నిర్వహిస్తున్న ఈవోపీఆర్డీ కె.శ్రీనివాసరావు శుక్రవారం జి.కొండూరులో బాధ్యతలు చేపట్టారు. అదే విధంగా వీఆర్ ఏఈ శ్రీనివాసరావు స్థానంలో సాంబశివరావు, టైపిస్ట్ లక్ష్మణరావు స్థానంలో మూర్తి బదిలీ అయ్యి జి.కొండూరు ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎస్.చిన్నరాత్నాలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని చల్లపల్లి మండలం నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన వెంకటరమణ గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు.


చిన్నరాత్నాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల ఈవోపీఆర్డీగా నియమితులైన డాకర్ల బాబూరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఆయన ఇక్కడ నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. తాజా బదిలీల్లో తిరిగి ఇక్కడికి వచ్చారు.


డి.బాబూరావు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో టి.కె.వి.రమణ బాధ్యతలు శుక్రవారం స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో బి.వై.విష్ణు గుడివాడకు బదిలీపై వెళ్లారు. ఈవోపీఆర్డీగా పి.ప్రభాకరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో టి.కె.వి.రమణ తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న బి.శ్రీనివాసరావు పెనమలూరు మండలానికి బదిలీపై వెళ్లారు.


టి.కె.వి. రమణ

పోలీసుల అదుపులో 5 ట్రాక్టర్లు..జేసీబీ


పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకొచ్చిన జేసీబీ, ట్రాక్టర్ల వద్ద ఎస్సై సుహాయిరాన్, సీఐ సురేష్

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక జగ్గవరపు గట్టుల వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని సమాచారం మేరకు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం దాడి చేశారు. ఈ క్రమంలో ఐదు ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై మోహన్‌రావు తెలిపారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా బుడమేరు ఇసుకను విజయవాడ పరిసర ప్రాంతాల్లోకి అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను జి.కొండూరు ఎస్సై సతీష్‌కుమార్ శుక్రవారం తెల్లవారుజామునం అదుపులోకి తీసుకున్నారు. గురువారం అర్ధరాత్రి మైలవరం మండలం గణపవరం గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లు, జి.కొండూరు మండలం వెల్లటూరుకు చెందిన ఒక ట్రాక్టర్‌తో విజయవాడ వైపు ఇసుక తరలి వెళ్తున్నట్లు ఎస్సైకు సమాచారం అందింది. దీంతో ఆయన తన సిబ్బందితో కందులపాడు సమీపానికి చేరుకుని ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించారు.

ప్రజాభిప్రాయానికే పెద్దపీట

ఇబ్రహీంపట్నంగ్రామీణం, న్యూస్‌టుడే:

స్వర్ణాంధ్ర దార్శనిక పత్రం రూపకల్పనలో ప్రజల నుంచి అభిప్రాయాలకు ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ఇందు కోసం అధికారులు గ్రామ స్థాయిలో గ్రామ సభలను మండల స్థాయిలో మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాలను నిర్వహించింది. దీంతోపాటు గ్రామాల్లో కూడా క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటికీ తిరిగి అభిప్రాయాలు సేకరించారు. దీనికోసం రూపొందించిన క్యూఆర్ కోడ్ ద్వారా గ్రామస్థులకు ప్రశ్నలు ఇచ్చి వారి నుంచి వచ్చే సమాధానాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంలోని పది గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. వాటిల్లో గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, మండల పరిషత్తు సమావేశంలో ఎంపీడీవో, మండల పరిషత్తు అధ్యక్షులు, అధికారులు క్యూఆర్ కోడ్ ముద్రించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. దానిని స్కాన్ చేయించి ప్రజల ఆలోచనలు సలహాలను ప్రశ్నావళి రూపంలో కోరుతూ సమాధానాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.


జూపూడి గ్రామసభలో స్వర్ణాంధ్ర దార్శనిక గోడపత్రికలో క్యూఆర్‌కోడ్‌ను వివరిస్తూ..

వివరాలు ఇవే

అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలతో పాటు పురోభివృద్ధికి చేయాల్సిన పనులను ప్రశ్నలతో సమాధానాన్ని గ్రామస్థుల నుంచి సేకరించారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేసి సంపద సృష్టి, సుస్థిర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల పెంపు, పేదరికం లేని సమాజ స్థాపనకు స్వర్ణాంధ్ర -2047లో ఏం చేయాలనేది ప్రజలు కోరుకుంటున్నారో వివరాలు సేకరించి నమోదు చేశారు. స్థానికంగా ఉపాధి ఉద్యోగ అవకాశాల అభివృద్ధి, ఆర్థిక అభివృద్ధి, భవిష్యత్తు నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు, మహిళా సాధికారత, రైతుల బలహీన వర్గాల ఆకాంక్షలు వంటి 11 అంశాలు ప్రశ్నావళికి సమాధానాలు సేకరించారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసేందుకు ముందుకు వచ్చే వారి పేర్లు వయస్సు, వృత్తి, చరవాణి నంబరు, చిరునామాలు కూడా కోడ్‌లో నమోదు చేశారు.

ప్రజలు ఏం కోరుకుంటున్నారో

గ్రామ సభలలో క్యూఆర్‌కోడ్ ద్వారా చరవాణిలో ఆన్‌లైన్ ద్వారా వివరాలతో పాటు వ్యక్తిగత అభిప్రాయాలు, ప్రభుత్వం నుంచి ప్రజలు ఏం కోరుకుంటున్నారు అభివృద్ధి సంక్షేమానికి చేపట్టాల్సిన పనులతోపాటు స్వర్ణాంధ్ర -2047 లక్ష్యంగా చేయాల్సిన పనులపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించినట్లు గ్రామ కార్యదర్శులు పేర్కొన్నారు.

తెదేపా నేత శేషగిరిరావుకు పుత్రవియోగం


కందిమళ్ల కేశవరావు

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు పట్టణానికి చెందిన తెదేపా బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కందిమళ్ల శేషగిరిరావు (పెద్దబుజ్జి) కుమారుడు కేశవరావు (55) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఇతను గతంలో పట్టణ తెదేపా ప్రధాన కార్యదర్శిగా, పంచాయతీ వార్డు సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శావల దేవదత్, పట్టణ, మండల నాయకులు తదితరులు కేశవరావు మృతదేహానికి నివాళులర్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

? కొండపల్లి చైతన్యనగర్ జాతీయ రహదారి వద్ద ధ్వంసమైన డ్రైనేజీ తొలగించి రెండు నెలలు గడిచినా నిర్మాణం చేపట్టకపోవడంతో ఆ ప్రాంతం అధ్వానంగా మారింది.
- జానేష్, స్థానికుడు

✔ ఆ నిర్మాణం జాతీయ రహదార్ల గుత్తేదారులు చేయాల్సి ఉంది. డ్రైనేజీకి బదులు ఏర్పాటు చేసి ఉంచారు. మిగిలిన పనులు చేస్తారు.
-సాయిగణేష్, పురపాలిక సహాయక ఇంజినీర్
- న్యూస్‌టుడే, కొండపల్లి


కుళాయి ఏర్పాటు

స్పందనకు వందనం

మండలంలోని మునగపాడులో ప్రధాన రహదారి పక్కనే కృష్ణా నీటి కుళాయి ఎత్తు తగ్గి మురుగులో ఉండని స్థానికులు దీంతో ఈ సమస్యను గత నెల 17న 'మేమున్నాం మీకు తోడుగా' లో ప్రచురించగా సర్పంచి పి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాసరావులు స్పందించి కుళాయికి మరమ్మతులు చేయించారు. దీంతో ఆ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, జి.కొండూరు

లిడ్‌కాప్ ఛైర్మన్‌కు సత్కారం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర తోళ్ల పరిశ్రమ అభివృద్ధి సంస్థ (లిడ్‌కాప్) ఛైర్మన్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన పిల్లి మాణిక్యాలరావును తాడేపల్లి కార్యాలయంలో పోలిశెట్టిపాడుకు చెందిన మాజీ ఎంపీపీ, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి వాసం మునియ్య శాలువతో సత్కరించారు. లిడ్‌కాప్ ద్వారా పేదలకు ఉపాధి కల్పించేందుకు, వారి ఆర్థికాభివృద్ధికి మాణిక్యాలరావు కృషి చేయాలని కోరారు.


మాణిక్యాలరావును సన్మానిస్తున్న మునియ్య తదితరులు

పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోండి


అవగాహన ప్రదర్శన నిర్వహిస్తున్న తెదేపా శ్రేణులు

ఇబ్రహీంపట్నంగ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని మూలపాడు, కేతనకొండ, కొటికలపూడి గ్రామాల్లో తెదేపా మండల శాఖ ఆధ్వర్యంలో ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెదేపా మండలాధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ 2021 అక్టోబరు ముందు డిగ్రీ పూర్తి చేసిన వారందరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. తెదేపా గ్రామ కమిటీలను సంప్రదిస్తే ఓటు నమోదులో సహాయసహకారాలు అందిస్తాయని వివరించారు. తెదేపా నాయకులు లేపాక్షిరావు, గోపాలరావు, సంజీవరావు, శ్రీనివాసరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు నైపుణ్యాలతో ఉద్యోగావకాశాలు


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ ఇబ్బా రవి

మైలవరం, న్యూస్‌టుడే: విద్యార్థులు వారి సబ్జెక్టులతో పాటు అదనపు నైపుణ్యాలపై పట్టు సాధించడం ద్వారా మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇబ్బా రవి పేర్కొన్నారు. కళాశాలలో మల్టీమీడియా, గ్రాఫిక్ డిజైనింగ్‌పై శుక్రవారం కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో అవకాశాలను ఎంఎఫ్‌జే ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు వి.క్రాంతి కుమార్ వివరించారు. ఫొటోషాప్, డీటీపీ, పేజ్‌మేకర్ వంటి వాటితో గ్రాఫిక్ డిజైనింగ్ చేయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ రంగారావు, కామర్స్, ఎకనామిక్స్ విభాగాధిపతులు శ్రీనివాసరావు, కరీముల్లా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరుతూ సీపీఎం నాయకులు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఇసుక కొరతతో పనులు లభించక కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు జి.వెంకటేశ్వరరావు, పి.ఆనందరావు, ఎ.అమ్మిరెడ్డి తదితరులు తమ డిమాండ్ల వినతిపత్రాన్ని రెవెన్యూ కార్యాలయంలో అందజేశారు.

తిరువూరు, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక హామీని ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ భవన శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నాయకులు ఎం.నాగేంద్రప్రసాద్, జి.వెంకటరత్నం, పి.శ్రీనివాసరావు, ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.సురేష్, శ్రీనివాసరావు తదితరులు ఆర్ఐ బి.మోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు.


ఉచిత ఇసుక కోసం ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ఉచిత ఇసుక ఇవ్వాలని కోరుతూ స్థానిక గాంధీ బొమ్మ కూడలిలో సీపీఎం మండల కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన, ప్రధాన రహదారిలో ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయినా ఇంకా హామీ అమలు చేయలేదని ఆగ్రహించారు.

ఉచిత ఇసుక హామీ నెరవేర్చాలి

మైలవరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు, కొరత నివారణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి రాఘవ రమేష్, సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బోసుబొమ్మ కూడలిలో కార్మికులతో కలిసి ధర్నా చేశారు. కొరతను నివారించాలని నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని అమలు చేసి, కార్మికులకు న్యాయం చేయాలన్నారు. జిల్లాలోని అన్ని క్వారీలను తెరవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇసాక్, సుబ్బారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక హామీని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని


బోసుబొమ్మ కూడలిలో సీపీఎం నాయకుల నినాదాలు

సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీకృష్ణ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని కొండపల్లిలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక పాలసీపై గత ఐదేళ్లు భవన నిర్మాణ రంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇసుకకు 36 వృత్తుల్లో 50వేల మంది కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఉన్నారన్నారు. భవన నిర్మాణ రంగం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇసుక క్వారీలు అన్నింటిని తెరవడంతో మాఫియాదారులు తగ్గుతారని చెప్పారు. కార్యక్రమంలో మహేష్, కొండలరావు, బేబీ సరోజని, భవన నిర్మాణ రంగ యూనియన్ నాయకులు ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి


రైతులతో కలిసి ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: నకిలీ మొక్కజొన్న విత్తనాలతో నష్టపోయిన నలుగురు కౌలు రైతులకు డీలరు నుంచి పరిహారం ఇప్పించాలని కోరుతూ సీపీఐ నాయకులు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఎ.కొండూరుకు చెందిన బాధిత రైతులు తిరువూరులోని ఓ దుకాణంలో మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసి 7 ఎకరాల్లో సాగు చేశారు. డీలరు తమకు నకిలీ విత్తనాలు విక్రయించడంతో దిగుబడి రాక ఎకరాకు రూ.70వేలు వరకు నష్టపోయామని బాధిత రైతులు రెవెన్యూ అధికారులకు వివరించారు. ఆ డీలరుకు పలుసార్లు పంట దిగుబడి రాలేదని చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు ఎం.డేవిడ్, వెంకటేశ్వరరావు, బాధిత రైతులు రంగారావు, విజయలక్ష్మి, రాఘవులు, సుధారాణి ఆందోళనలో పాల్గొన్నారు.

బైకు ఢీ..మహిళకు గాయాలు

ఇబ్రహీంపట్నంగ్రామీణం: జూపూడి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసుల సమాచారం మేరకు ఇబ్రహీంపట్నం గాజులపేటలో నివాసముంటున్న బత్తుల అరుణ శివసారధి జూపూడి నిమ్రా ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తోంది. ఉదయం ఆసుపత్రికి వెళ్లేందుకు ఆటో ఎక్కి ఆసుపత్రి రోడ్డు ఎదురుగా జాతీయరహదారి పక్కన దిగింది. ఈ క్రమంలో రహదారి దాటుతుండగా మూలపాడు వైపునుంచి వేగంగా వస్తున్న ద్విచక్రవాహన చోదకుడు ఆమెను ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గంపలగూడెం : నెమలి వేణు గోపాలస్వామి ఆలయంలో


ఎ.కొండూరు : పోలిశెట్టిపాడు రామాలయంలో


విస్సన్నపేట : పుట్రేల మారెమ్మ గుడిలో


తిరువూరు : జి.కొత్తూరులో


రెడ్డిగూడెం : కూనపరాజు పర్వ గ్రామంలో..


ఇబ్రహీంపట్నంగ్రామీణం : ఎన్టీటీపీఎస్ అభయసాయి మందిరంలో గాయత్రి మాతగా అమ్మవారు


మైలవరం రేణుకాదేవి ఆలయంలో..

జగన్మాత.. జగమేలు గాయత్రి

న్యూస్‌టుడే బృందం :

దేవీ నవరాత్రుల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం మండపాల్లో, ఆలయాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల చిన్నారులు..మహిళలు బతుకమ్మలు పేర్చి సంబరాలు చేసుకున్నారు.


మైలవరం: బతుకమ్మలతో చిన్నారులు


జి.కొండూరు బీసీ కాలనీలో..


కొండపల్లిలో..


ఎ.కొండూరు : చీమలపాడు శ్రీరామమందిరంలో

అప్పు తీసుకున్న సొమ్ము అడిగినందుకు దాడి

మేడూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని మేడూరుకు చెందిన బరిగెల రామకృష్ణపై అదే గ్రామానికి చెందిన యద్దనపూడి గోపాలకృష్ణ అలియాస్ గోపి కర్రతో దాడి చేసినట్లు శుక్రవారం కేసు చేశామని ఎస్సై ఎస్.శ్రీను తెలిపారు. తనకు ఇవ్వాల్సిన డబ్బులు అడిగినందుకు నిందితుడు తనపై గురువారం రాత్రి మేడూరు సమీప రెస్టారెంట్ వద్ద దాడికి పాల్పడినట్లు రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తలకు గాయమవ్వడంతో ఫిర్యాదుదారుడిని విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

వేధింపులపై కేసు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: తన భర్త శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడంటూ.. వివాహిత ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..ఇబ్రహీంపట్నం జాకీర్‌హుస్సేన్ కళాశాల ప్రాంతంలో నివాసముంటున్న డేవిడ్, సుజనాలకు ఆరేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. డేవిడ్ మేకలు కాస్తూ ఉంటాడు. ఈ క్రమంలో 100 మేకలు కొనాలని వాటికి డబ్బులు అత్తారింటి నుంచి తీసుకురావాలని భార్యను వేధింపసాగాడు. అత్తా, మామలు కూడా అతడికి వంత పలుకుతుండడంతో సహనం కోల్పోయిన బాధితురాలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

మాధవరం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని మాధవరం సమీపంలో జూదమాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,650 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సీహెచ్.కృష్ణ శుక్రవారం తెలిపారు.

అందరికీ అందుబాటులో ఉంటాను : శావల

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు నియోజకవర్గంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలకు ఇకపై తాను అందుబాటులో ఉంటానని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శావల దేవదత్ వెల్లడించారు. శుక్రవారం ఆయన స్థానిక న్యూస్‌టుడేతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని పార్టీ వర్గీయులకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నాలుగు మండలాల్లోని అన్ని గ్రామాల నుంచి గురు, శుక్రవారం పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు అభిమానంతో తన కార్యాలయానికి వచ్చి ఆయన్ను కలిశారు.

PUBLIC NOTICE

Public are hereby informed that Our Corporation has sanctioned a Term Loan of **Rs.275.00 Lakhs (Rupees Two Hundred and Seventy Five Lakhs Only) M/s.Sri Varnika Granites** at Sy.No.945/1, Sub Divisional Sy.No.945/1B, Mallayapalem Road, Konidena Village, Ballikurava Mandal, Bapatla District, a sole proprietrix concern, represented by **Smt.Madhavareddy Siva Parvathi, W/o Sri Madhavareddy Manohar,** resident of Flat No.802, 8th Floor, Unit No.1A, Building No.3, Aparna Amaravati One Apartment, Kunchenapalli Road, Tadepalli Municipal Corporation, Mangalagiri, Guntur District. The Corporation proposes to create equitable mortgage over the following property. **Collateral Security :** Freehold Interest in Door No.1-29 in site admeasuring 220 Sq.yards in Plot No.33, R.S.Nos.170/1 and 170/C with L.P.No.63/89 located at Ramesh Nagar, The Gopi Krishna Co-operative Building Society Limited, Guntupalli Village, Ibrahimpatnam Mandal, N.T.R.District and is **Bounded by : North :** House belongs to Sri Karunakar Rao with Door No.1-23, **South :** House belongs to Sri.Petham Venkateswara Rao with Door No.1-21, **East :** Open Plot Nos.41 and 42, **West :** Road, together with buildings constructed/and to be constructed thereon. The above above property belongs to **Sri Madhavareddy Manohar, S/o Sri Madhavareddy Hanumantha Rao** and he is now offering the same as collateral security and he has acquired the same **vide registered sale deed document No. 2695/2011** registered with Sub Registrar office, Ibrahimpatnam, NTR District. He is depositing the said document together with its link document and corroborated records through registered memorandum of deposit of title deed by creating charge in favour of the Corporation in consideration of aforesaid Term Loan of **Rs.275.00 Lakhs (Rupees Two Hundred and Seventy Five Lakhs Only)** sanctioned to **M/s.Sri Varnika Granites** at Sy.No.945/1, Sub Divisional Sy.No.945/1B, Mallayapalem Road, Konidena Village, Ballikurava Mandal, Bapatla District, a sole proprietrix concern, represented by **Smt. Madhavareddy Siva Parvathi, W/o Sri Madhavareddy Manohar,** resident of Flat No.802, 8th Floor, Unit No.1A, Building No.3, Aparna Amaravati One Apartment, Kunchenapalli Road, Tadepalli Municipal Corporation, Mangalagiri, Guntur District to set up a granite slabs processing unit. If there are any objections for the above mortgage, the same shall be inform to the undersigned along with necessary documentary evidence within seven days from the date of issuance of this public notice. If no objections are received, further action will be taken concluding the at the property is free from all claims/objections from the public.

Date : 04.10.2024 **Branch Manager, A.P.State Financial Corporation**
Place : Ongole **37-1-406(4), 2nd Lane, Bhagyanagar, Ongole-523001**

విజయవాడ తూర్పు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ): మొగల్రాజపురం సెక్షన్, మహాత్మాగాంధీ ఇండోర్ విద్యుత్తు ఉపకేంద్రం, 11 కేవీ శివగిరి ఫీడర్ పరిధిలో విద్యుత్తు మరమ్మతులు, మెయింటినెన్స్ నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శివాలయం వీధి, గుమ్మడితోట, గుమ్మడివారి వీధి, బోయపాటి మాధవరావు వీధి, బందులదొడ్డి, సీఎస్ఐ చర్చి, కమిలి బాబా ఆశ్రమం, శివగిరి ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నామని, ఆ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

లబ్బీపేట(విజయవాడ సిటీ): లబ్బీపేటలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండోరోజైన శుక్రవారం రాత్రి భేరీ తాడనం, బలిహరణ, గరుడ ధ్వజారోహణం నిర్వహించారు. వీటి విశిష్టతను శ్రీనివాస ఆచార్యులు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


పాల్గొన్న మహిళలు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80085 74652

స్పందనకు వందనం

- రెండో డివిజన్ ఏలూరు రోడ్డు గుణదల వద్ద భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగుతోందని స్థానిక నివాసి రంగనాయకమ్మ 'మేమున్నాం... మీకు తోడుగా' ద్వారా ఏఈ నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి పూడిక తీయించారు.
- అయ్యప్పనగర్ 12-51/82 విద్యుత్ స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి నాగేంద్ర ప్రసాద్ 'మేమున్నాం... మీకు తోడుగా' ద్వారా ఏఈ నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు.
- నాలుగో డివిజన్ వెంకటేశ్వర నగర్ లయోల కళాశాల ఆడిటోరియం ఎదురుగా చెత్త కుప్పలు తిష్ఠ వేశాయని స్థానిక నివాసి జీవన్ 'మేమున్నాం... మీకు తోడుగా' ద్వారా శానిటరీ అధికారి జానకిరామ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చెత్త తొలగించి బ్లీచింగ్ జల్లించారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

ధాన్యం విక్రయాల్లో ఇబ్బందుల పరిష్కారానికి కంట్రోల్ రూమ్

కృష్ణలంక, న్యూస్‌టుడే: జిల్లాలో రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌లో ధాన్యం విక్రయించడంలో తలెత్తే ఇబ్బందులు, సందేహాలు, సమస్యలను పరిష్కరించడానికి జిల్లా మేనేజర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా ఒక ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో ఇద్దరు సిబ్బందిని ఏర్పాటు చేశామని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రైతులు 77020 03571కి ఫోన్ చేయవచ్చన్నారు.

ఊరెళ్లినా.. ఇల్లు భద్రం

'ఎల్‌హెచ్‌ఎంఎస్'తో చోరీలకు అడ్డుకట్ట

పటమట, న్యూస్‌టుడే

- గుణదలకు చెందిన నవీన్ ఈ ఏడాది మే నెలలో తన కుటుంబ సభ్యులతో వేసవి సెలవులకు బెంగళూరు వెళ్లారు. 15 రోజుల తర్వాత తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులకొట్టి బీరువాలోని అరున్నర కాసులు బంగారం, 120 గ్రాముల వెండి, రూ.10 వేల నగదు దొంగలించినట్లు గుర్తించారు. లబోదిబో మంటూ మాచవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు....
- భారతీనగర్‌కు చెందిన నాగేశ్వరరావు ఈ ఏడాది సంక్రాంతి పండగకు కుటుంబ సభ్యులతో పాటు భీమవరం వెళ్లారు. పండగ అనంతరం తిరిగి ఇంటికి రాగా తాళాలు పగలుకొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న రూ.90 వేలు విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు కనిపించ లేదు. దీంతో పటమట స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కళాశాలలకు, పాఠశాలలకు దసరా సెలవులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో చాలామంది పుణ్యక్షేత్రాలకు, బంధువుల ఇళ్లకు వెళ్తుంటారు. నగరంలో ఉంటున్న ప్రజల తమ సొంత ఊర్లకు పయనమవుతారు. దీన్ని ఆసరాగా తీసుకున్న దొంగలు తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. వీటిని అరికట్టేందుకు రాష్ట్ర పోలీసు శాఖ 2017 సెప్టెంబరులో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా 'లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్'(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ప్రారంభించింది. సాంకేతికతతో నేరాలు అదుపు చేసేందుకు ఈ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుంది. కానీ ప్రజల్లో అవగాహన లేక ప్రారంభించి 7 ఏళ్లు అవుతున్న దీన్ని వినియోగించుకుంటున్న వారి సంఖ్య తక్కువగానే ఉంటోంది.

యాప్ ప్రారంభం: 2017 సెప్టెంబర్
నగర వ్యాప్తంగా నమోదు చేసుకున్న వారి సంఖ్య: 40,000
వినియోగించుకున్నవారు: 970

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ చిహ్నం

పని చేస్తుందిలా...

గూగుల్ స్టోర్ నుంచి 'ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఫోన్ నెంబరు, చిరునామాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తర్వాత వచ్చే ఐడీని భద్రపరుచుకోవాలి. ఊరు వెళ్లాల్సిన సందర్భంలో యాప్‌లోకి వెళ్లి యూజర్ ఐడీ నమోదు చేసి ఊరుకు వెళ్లే సమయం, తిరిగి వచ్చే సమయం టైప్ చేసి 'రిక్వస్ట్ పోలీస్ వాచ్' అనే ఆప్షన్ ఎంచుకోవాలి. సమాచారం అందుకున్న కంట్రోల్ రూమ్ పోలీసులు లోకల్ పోలీసులు సహకారంతో రిక్వస్ట్ వచ్చిన అడ్రస్‌లో వైఫై రూటర్, సెన్సార్‌తో పనిచేసే మోషన్ కెమెరాలు, కరెంట్ పోయిన పనిచేసేలా యూపీఎస్ ఏర్పాటు చేసి, పోలీస్ కంట్రోల్ రూమ్‌కి అనుసంధానిస్తారు. తాళం వేసి ఉన్న ఇంట్లోకి అపరిచితులు చొర బడేందుకు ప్రయత్నిస్తే సెన్సార్ ద్వారా ఫోటోలు తీయడంతో పాటు అలారం ద్వారా కంట్రోల్ రూం, లోకల్ పోలీసులను అప్రమత్తం చేస్తుంది. నిమిషాల వ్యవధిలో పోలీసులు అక్కడకు చేరుకుని దొంగలను పట్టుకునే అవకాశం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి..

ఎల్‌హెచ్‌ఎంఎస్ వ్యవస్థ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. నేరాలు జరగకుండా ముందు జాగ్రత్తగా దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఊరులో లేని సమయంలో పైసా ఖర్చు లేకుండా ఇళ్లు పోలీసుల నిఘాలో ఉంటాయి.
- వి.పవన్ కిషోర్, పటమట సీఐ



5జీ సాంకేతికతపై కార్యశాల

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఆంధ్రా లయోల ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఫాదర్ బి.జోజిరెడ్డి అన్నారు. కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో '5జి సాంకేతికత'పై శుక్రవారం కార్యశాల నిర్వహించారు. కొత్తగా వస్తున్న సాంకేతికతలపై దృశ్య మాలిక ప్రదర్శించారు. కళాశాల సహాయ డైరెక్టర్ ఫాదర్ డి.బాలస్వామి, ప్రిన్సిపల్ మహేష్, ఐక్యూఏసీ సమన్వయకర్త క్యాండీ డికౌజా, డీన్ ఎం.రామకృష్ణలు హాజరయ్యారు. ఈసీఈ విభాగాధిపతి కె.ప్రశాంతి జాస్మిన్, సమన్వయకర్తలుగా మల్లికార్జునరావు, విజయ్ కుమార్, అప్పలరాజులు వ్యవహరించారు.

రోగులకు దుప్పట్లు, పండ్ల పంపిణీ

పటమట, న్యూస్‌టుడే: గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించి వారికి పండ్లు, దుప్పట్లు అందజేశారు. నాయకులు దేవ కుమార్, కిరణ్, హరి, పరసా కిరణ్ కుమార్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారులకు బస్సు సౌకర్యం కల్పించరూ..!

కృష్ణలంక: కనక దుర్గమ్మ దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా దేవస్థానం అధికారులు కృష్ణవేణి ఘాట్ పరిసరాల్లో దర్శనం టిక్కెట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కౌంటర్లలో రూ.300, రూ.500ల దర్శనం టిక్కెట్లు విక్రయిస్తున్నారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో దసరా వేడుకల నిర్వహణలో భాగంగా మహిళలు, వృద్ధులు, పిల్లల కోసం దేవస్థానం సీతమ్మవారిపాదాల సెంటర్ నుంచి కొండపైన ఆలయం వరకు ఉచిత బస్సును ఏర్పాటు చేసింది. అనంతరం వైకాపా పాలనలో నిర్వహించిన వేడుకల్లో ఉచిత బస్సును ఏర్పాటు చేసినప్పటికీ అది కేవలం రూ.300లు, రూ.500ల దర్శనం టిక్కెట్లను కొనుగోలు చేసిన వారికి మాత్రమే పరిమితం చేయడంతో గతంలో విమర్శలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం అందుకు భిన్నంగా కేవలం రూ.500లు టిక్కెట్లను కొనుగోలు చేసిన వారికి, వృద్ధులకు, దివ్యాంగులకు మాత్రమే ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడంతో మహిళలు, చిన్నారులు నిరాశ చెందుతున్నారు. ఒక పక్క ఎండలకు బెంబేలెత్తుతున్న భక్తులు ఉచిత బస్సును కొందరికే పరిమితం చేయడంపై పెదవి విరుస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల్లో అధికులు పీఎన్‌బీఎస్‌లో బస్సులు దిగి సీతమ్మవారి పాదాల సెంటర్‌కు చేరుకుని కేశఖండనశాలలో తలనీలాలు సమర్పించి దర్శనానికి వెళుతున్న కారణంగా ఉచిత బస్సును మహిళలకు, పిల్లలకు కూడా కొనసాగించాల్సిందిగా భక్తులు కోరుతున్నారు.


కృష్ణవేణి ఘాట్ వద్ద దేవస్థానం బస్సు


క్యూలైన్‌కు వెళ్లే మార్గంలో కానరాని నీటి పాయింట్

'అమ్మ' భక్తులకు తీరని దాహార్తి

కృష్ణలంక, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రిని పురస్కరించుకుని దుర్గమ్మను దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు తీవ్ర ఎండల ధాటికి దాహార్తితో అల్లాడుతున్నారు. భక్తుల దాహార్తి తీర్చేందుకు విజయవాడ నగరపాలకసంస్థ సీతమ్మవారిపాదాల సెంటర్‌లో మంచి నీటి ప్యాకెట్లను, బాటిళ్లను ఏర్పాటు చేసింది. వినాయకుడి గుడి క్యూలైన్లలో చేరుకుంటున్న భక్తులకు మాత్రం నిరంతరం నీటిని అందజేస్తున్నారు. కాగా దర్శనం నిమిత్తం బస్‌స్టేషన్ నుంచి, నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వారు వాటర్ పాయింట్ ఘాట్ పరిసరాల్లో ఉన్నట్లు తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్‌స్టేషన్ వైపు నుంచి వచ్చే వారికి రాజీవ్‌గాంధీ మార్కెట్ పరిసరాల్లో, క్యూలైన్‌లోకి వెళ్లే వారికి నగర పాలక సంస్థ కార్యాలయం సమీపంలో పాయింట్లను ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

'శాప్'ను ప్రక్షాళన చేస్తాం: రవి నాయుడు

విజయవాడ క్రీడలు: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్‌గా అనిమిని రవినాయుడు బాధ్యతల స్వీకరణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక ఐజీఎంసీ స్టేడియం వద్ద గల శాప్ కార్యాలయానికి ఆయన ఊరేగింపుగా తరలివచ్చారు. రవినాయుడు దంపతులను వేదపండితులు పూర్ణకుంభంతో కార్యాలయంలోకి స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి సమక్షంలో శాప్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీఎస్ గిరీశా పుష్పగుచ్ఛాన్ని అందించి బాధ్యతల స్వీకరణ దస్త్రంలో సంతకం చేయించారు. కార్యక్రమానికి రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఎం. రామ్‌ప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో తెదేపా కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైకాపా అధినేత జగన్.. ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. వైకాపా నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. రవినాయుడు మాట్లాడుతూ శాప్‌ను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు. వైకాపా హయాంలో క్రీడాశాఖ మంత్రిగా పనిచేసిన ఆర్కే రోజా, శాప్ ఛైర్మన్‌గా పని చేసిన బైరెడ్డి సిద్ధార్థలు రాష్ట్రంలో క్రీడారంగాన్ని నాశనం చేశారని మండిపడ్డారు. రవినాయుడుకు శాప్ బాధ్యతలు అప్పగించడం ఆయన పడిన కష్టానికి ప్రతిఫలమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భాష్యం ప్రవీణ్, నక్కా ఆనందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీతల సుజాత పాల్గొన్నారు.


బాధ్యతలు చేపడుతున్న రవినాయుడు, చిత్రంలో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, శాప్ ఎండీ గిరీశా, తదితరులు

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

మధురానగర్(విజయవాడ), న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉపాధి చూపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎం.ఎస్.ఎం.ఇ.డి.సి.) ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ ముత్యాలంపాడులోని ఎం.ఎస్.ఎం.ఇ. కార్యాలయంలో ఛైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న శివశంకర్


త్రిశక్తిపీఠం కాళీమాత ఆలయంలో శ్రీబాలాత్రిపుర సుందరి అలంకరణ


దర్శిపేటలో..


కరెన్సీనగర్: సాయి మందిరంలో ..

జగజ్జనని.. దుర్గా భవానీ

విజయవాడ సిటీ, కృష్ణలంక, పటమట, కరెన్సీనగర్, న్యూస్‌టుడే: నగరంలో దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం అమ్మవారు బాలాత్రిపుర సుందరి, గాయత్రి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా చోట్ల ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.


సిద్ధార్థ హోటల్ మేనేజ్ కళాశాల మైదానంలో..


ఎంజీరోడ్డులో అనంత్ డైమండ్స్ ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ

అందుబాటులో అధునాతన ఉపకరణాలు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : లబ్బీపేటలోని వైవీరావు హాస్పటల్ రోడ్డులోని ఎస్.ఎస్.కన్వెన్షన్‌లో ఆంధ్రప్రదేశ్, విజయవాడ హోటల్స్, కేటరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించే 'మెగా ఫుడ్ బిజినెస్ ఎక్స్‌పో'ను శుక్రవారం హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వి.స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే ఎన్నో రుచికరమైన ఆహార పదార్థాలు అందుబాటులోకి వచ్చాయని, వాటిని తయారుచేసే వివిధ పరికరాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించి అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఆ సంఘం విజయవాడ అధ్యక్షుడు పీవీ రమణ, కార్యదర్శి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా

విజయవాడ క్రీడలు: మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాలకు చెందిన ఇరువురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ చుండి వెంకటేశ్వర్లు తెలిపారు. గత నెల 27 నుంచి 29వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం దేవాస్ జిల్లా మీతా తలాబ్‌లో జరిగిన 9వ జాతీయ కనోయ్ పోలో ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించిన దొడ్డి పార్థు లక్ష్మీ శ్రీనివాస్ సీనియర్ పురుషుల విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకోగా. . కన్నా ఈశ్వర్ జూనియర్ బాలుర విభాగంలో రజత పతకం సొంతం చేసుకున్నాడు. శుక్రవారం కళాశాలలో క్రీడాకారులను, పీడీ కె.మార్కండేయులును పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, పీడీ మార్కండేయులు

అనుమానాస్పద స్థితిలో ఉద్యోగి మృతి

కృష్ణలంక, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బండారు రమేష్(38) కృష్ణలంక హైస్కూల్ సమీపంలోని డ్రైనేజీ పంపింగ్ స్టేషన్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు కాగా కుటుంబంతో కృష్ణలంక తిరుమలరావు వీధిలో ఉంటున్నారు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం విధులకు వచ్చిన అతడు పంపింగ్ స్టేషన్ సమీపంలో పాడుబడిన భవనంలోని సీలింగ్ కొక్కేనికి తాడుతో ఉరివేసుకుని వేలాడుతుండటాన్ని గమనించి సమీపంలోని వారు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న క్రమంలో కొద్ది సేపటికి అతడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించి ఆర్థిక ఇబ్బందుల కారణంగా బలవన్మరణానికి పాల్పడి ఉండొచ్చన్నారు. అనుమానస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యాజమాని మందలించాడని డ్రైవర్ ఆత్మహత్య

పటమట,: యాజమాని మందలించాడని అంబులెన్సు డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని రామలింగేశ్వరనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామలింగేశ్వరనగర్‌కు చెందిన ఎర్రంశెట్టి రాజా రమేష్(44) అంబులెన్సు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటారు. అతనికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో మంగళవారం రమేష్ ముదినేపల్లి కిరాయికి వెళ్లి తిరిగి వచ్చే సమయంలో గుడ్లవల్లేరు వద్ద ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలవ్వగా పోలీసులు అంబులెన్సును గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అప్పటి నుంచి రమేష్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. కేసు పరిష్కారమైన తర్వాత గురువారం సాయంత్రం అంబులెన్సు తీసుకువచ్చి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సర్వీసు రోడ్డులో పార్కింగ్ చేసి వెళ్లిపోయారు. దీంతో యజమాని కిషోర్ శుక్రవారం రమేష్‌కు ఫోన్ చేసి అంబులెన్సు కిరాయి ఇవ్వలేదంటూ మందలించారు. రమేష్ మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ మేరకు మృతుడి భార్య శ్రీదేవి ఫిర్యాదు చేయగా. . పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమాజాభివృద్ధికి ఆర్య వైశ్యుల కృషి

కృష్ణలంక, న్యూస్‌టుడే: సేవ అంటే గుర్తొచ్చేది ఆర్య వైశ్యులని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంబీ విజ్ఞానకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వరద బాధితుల ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరదల కారణంగా అనేక మంది నిరాశ్రయులయ్యారని, ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గరుండి సహాయక చర్యలు పర్యవేక్షించినట్లు చెప్పారు. వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుందని, ప్రభుత్వం పిలుపు మేరకు నిరాశ్రయులైన 600 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున రూ.30 లక్షలను సంఘం అందజేస్తున్నట్లు చెప్పారు. సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అరవేటి నిర్మల, రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ వరదల్లో నష్టపోయిన వర్గీయులకు తమ వంతుగా రూ.3 లక్షలు విరాళంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న మంత్రి భరత్, సంస్థ ప్రతినిధులు

నేడు, రేపు బస్సు పాస్ కౌంటర్లు నిలిపివేత

ఆటోనగర్, న్యూస్‌టుడే: ఏపీఎస్ ఆర్టీసీ బస్సు పాస్ వెబ్‌సైట్ ఆధునికీకరణ నిమిత్తం నేడు, రేపు ఆటోనగర్ డిపోలో బస్సు పాస్ కౌంటర్లు నిలిపివేస్తున్నట్లు ఆటోనగర్ బస్‌స్టేషన్ డిపో మేనేజర్ కె.ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజులు ప్రయాణికులు, విద్యార్థుల బస్సు పాస్‌లు ఆన్‌లైన్‌లో కూడా రెన్యువల్ చేసే అవకాశం లేదని పేర్కొన్నారు. ఈ నెల 7 నుంచి తిరిగి ఆన్‌లైన్ సేవలతో పాటు బస్సు స్టేషన్‌లో బస్సు పాస్ కౌంటర్లు ప్రారంభమవుతాయని తెలిపారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్, పక్కన జోనల్ కమిషనర్ రమ్యకీర్తన

సురక్షిత తాగునీరు అందిస్తాం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : పశ్చిమ నియోజకవర్గంలోని ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలనేది ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ(సుజనా చౌదరి) లక్ష్యమని, అందులో భాగంగానే పైలెట్ ప్రాజెక్టు ద్వారా సర్వే చేసి అందించడానికి ప్రయత్నం చేస్తున్నామని 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్ అన్నారు. పాలి క్లినిక్ రోడ్డులోని ఓ హోటల్లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 22 డివిజన్లు ఉండగా 11 డివిజన్లు కొండ ప్రాంతాల్లో ఉన్నాయని, వీటికి అనేక దశాబ్దాలుగా తాగునీరు పూర్తిస్థాయిలో అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే ముందుకొచ్చారని, అందులో భాగంగా పూర్ణ గ్లోబల్ స్ట్రాటజీస్, స్మిత్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కోయంబత్తూరులో విజయవంతమైన ఈ పైలెట్ ప్రాజెక్టును ప్రజలకు అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు రామన్ రఘునాథన్, దామోదర్, సుజనా ఫౌండేషన్ సాంకేతిక సలహాదారు నారాయణమూర్తి పాల్గొన్నారు.

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట



టోకెన్లు ఇస్తున్న పెండెం గాంధీ

అన్నక్యాంటీన్లు పేదలకు వరం

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక అన్నక్యాంటీన్‌లో తెదేపా విభిన్న ప్రతిభావంతుల కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధులు వంద మందికి ఉచితంగా భోజనాలు అందజేశారు. అన్నక్యాంటీన్‌లో శుక్రవారం కమిటీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పెండెం గాంధీ, విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావులు పేదలు ఉచితంగా భోజనాలు చేసేందుకు వీలుగా వంద టోకెన్లు పంపిణీ చేశారు. దీనిపై పేదలు కమిటీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబు తిరిగి అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయటం వల్ల పేదలు ఆకలి తీరుతుందని గాంధీ పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వం క్యాంటీన్లను మూసివేసి పేదల పొట్ట కొట్టిందన్నారు. కూటమి ప్రభుత్వ సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు.

రాకపోకలకు తొలగిన అడ్డంకులు



పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలులో మునేరు వంతెనపై వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్న శిలాఫలకం దిమ్మెను శుక్రవారం ఆర్‌అండ్‌బీ అధికారులు తొలగించడంపై వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. గత నెలలో మునేరుకు వచ్చిన భారీ వరదకు వంతెనపై ఉన్న శిలాఫలకం దిమ్మె కూలడంతో రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారింది. ఈ సమస్యను శుక్రవారం 'ఈనాడు'లో 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో ప్రచురించిన వార్తకు ఆర్‌అండ్‌బీ డీఈఈ పరశురాముడు స్పందించారు. పొక్లెయిన్ సాయంతో వంతెనపై ఉన్న దిమ్మెను తొలగించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

- కంచికచర్ల ప్రణీత కాలనీలో రహదారిపై గ్రావెల్ పడి ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని కాలనీకి చెందిన రాజేశ్వరరావు 'ఈనాడు మీ తోడు' ద్వారా పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానికి ఫిర్యాదు చేయగా, స్పందించిన ఆయన గ్రావెల్‌ను సిబ్బందితో తొలగించారు.
- వీరులపాడు మండలం పొన్నవరం బీసీ కాలనీలో తాగు నీటి పైపు లైను పగిలి తాగు నీరు వృథాగా పోతుందని గ్రామానికి చెందిన రంగారావు 'ఈనాడు మీ తోడు' ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణ కిషోర్‌కు సమాచారం అందించగా, స్పందించిన ఆయన పైపు లైనుకు మరమ్మతులు చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.
- వీరులపాడు మండలం వెల్లంకి ఎస్సీ కాలనీ ట్యాంకు సమీపంలో మురుగు కాలువలో చెత్త పేరుకుపోయి నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తుందని, గ్రామానికి చెందిన రత్నాకర్ 'ఈనాడు మీ తోడు' ద్వారా పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేయగా, స్పందించిన ఆయన సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు.
- కంచికచర్ల ఇందిరా కాలనీ చర్చి సమీపంలో ఉన్న రహదారికి ఇరువైపులా చెత్త కుప్పలు ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని కాలనీకి చెందిన వెంకట్రావు 'ఈనాడు మీ తోడు' ద్వారా పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయగా, స్పందించిన ఆయన సిబ్బందితో చెత్తను తొలగింపజేసి బ్లీచింగ్ జల్లించారు.
- వీరులపాడు మండలం వి.అన్నవరం సాయిబాబా గుడి సమీపంలో వీధి దీపం వెలగడం లేదని గ్రామానికి చెందిన దొండపాటి సురేష్ 'ఈనాడు మీ తోడు' ద్వారా పంచాయతీ కార్యదర్శి నారాయణకు ఫిర్యాదు చేయగా, స్పందించిన ఆయన సిబ్బందితో వీధి దీపాన్ని మార్పించారు. – వీరులపాడు న్యూస్‌టుడే

ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ



శ్రీను

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు ఎంపీడీవోగా నియమితులైన జి.శ్రీను మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఏలూరు జిల్లా పోలవరం నుంచి బదిలీపై పెనుగంచిప్రోలు వచ్చారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా పని చేసిన సాయిహర్ష అల్లూరి సీతారామ రాజు జిల్లా ముంచింగు మండలానికి బదిలీ అయ్యారు.

అన్నీ తప్పులు.. రైతన్నకు తిప్పలు

భూముల రీసర్వే లోపాలమయం

దృష్టిసారించని రెవెన్యూ అధికారులు



నందిగామ, న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వంలో 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ రక్ష, భూ హక్కు' పథకంలో చేపట్టిన భూముల రీ సర్వేలో తప్పులతో అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. సర్వే సక్రమంగా చేయకపోవటం వల్ల భూముల కొలతల్లో పూర్తిగా తేడాలు వచ్చాయి. ఇవేమి పట్టించుకోకుండా ఆన్‌లైన్ చేయటంతో ఇబ్బంది పడుతున్నారు. తప్పులు సరి చేయాలని రెవెన్యూ అధికారులకు ఎన్ని సార్లు అర్జీలు పెట్టినా పట్టించుకోవట్లేదు. దీనికి తహసీల్దారు కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవట్లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సర్వే పూర్తయినట్లు నోటిఫికేషన్ వచ్చాక తమ స్థాయిలో ఏమి చేయలేమని మండల రెవెన్యూ అధికారులు అంటున్నారు. దీనిపై ఎన్డీయే కూటమి ప్రభుత్వం రీ సర్వేలో తప్పులు సరిచేయాలని కోరుతున్నారు.

అంతా వారిష్టం..

నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో కొన్ని గ్రామాల్లో భూములు రీసర్వే చేశారు. భూములు సర్వే పూర్తి చేసినట్లు జిల్లా అధికారులు 13 నోటిఫికేషన్ జారీ చేశారు. భూముల సర్వే అనంతరం రికార్డులు ఆన్‌లైన్ చేశారు. ఇంకా కొన్ని గ్రామాల్లో చేయాల్సి ఉంది. వంద రోజుల్లో సర్వే పూర్తి చేయాలని లక్ష్యాలు విధించటం వల్ల రెవెన్యూ, గ్రామ సచివాలయాల ఉద్యోగులు సక్రమంగా చేయలేదు. తక్కువ సమయం ఇవ్వటంతో హడావుడిగా ప్రక్రియ నిర్వహించి మమ అనిపించారు. ముందుగా డ్రోన్‌తో గ్రామాల్లో భూముల చిత్రాలను సేకరించారు. దీని ప్రకారం ఎఫ్‌ఎంబీలో భూముల హద్దులు చూసి రైతుల సమక్షంలో సర్వే చేయాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా కొందరు ఉద్యోగులు రైతుల ప్రమేయం లేకుండా తమకు తోచిన విధంగా నమోదు చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా భూముల కొలతల్లో భారీ వ్యత్యాసాలు వచ్చాయి. ఆన్‌లైన్‌లో చూస్తే ఒక్కొక్కరికి 50 సెంట్లు ఎకరం కంటే ఎక్కువ కూడా భూమి తగ్గినట్లు వస్తుంది. వీటిని చూసి రైతులు అవాక్కు అవుతున్నారు.

వెలదికొత్తపాలెంలో ఇలా..

చందర్లపాడు మండలం వెలదికొత్తపాలెంలో 1500 ఎకరాలు రీసర్వే చేశారు. ఇందులో భూములు సరిపడా ఉన్నప్పటికీ పరిగణలోకి తీసుకోలేదు. కొందరికి ఉన్నదాని కంటే ఎక్కువగా, మరికొందరికి తక్కువగా వచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో గ్రామంలో 400 మంది రైతులకు 350 మంది భూములు తేడాలు రావటంతో చందర్లపాడు తహసీల్దారుకు ఐదు నెలల క్రితం అర్జీలు పెట్టారు. ఇప్పటి వరకు ఒక్క రైతు సమస్య పరిష్కరించలేదు. ఇదే విధంగా నందిగామ మండలం లింగాలపాడు, అడవిరావులపాడు, మునగచర్ల, తక్కెళ్లపాడు, చందర్లపాడు మండలం కాట్రేనిపల్లి తదితర గ్రామాల్లో తేడాలు వచ్చాయి.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

-కొత్త కోటేశ్వరరావు, వెలదికొత్తపాలెం

మా గ్రామంలో భూముల రీసర్వేలో చాలా తప్పులు జరిగాయి. దీనిపై అర్జీలు పెట్టిన రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవట్లేదు. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. తప్పుడు సర్వేల వల్ల బ్యాంకు రుణాలు తీసుకోలేకపోతున్నాం.

తక్కువ చూపిస్తోంది..

-నలజాల సత్యనారాయణ, మునగచర్ల

మునగచర్ల పరిధిలో నా పొలం రీసర్వే నాకు తెలియకుండానే చేశారు. ఇప్పుడు ఆన్‌లైన్ చాలా తక్కువ చూపిస్తోంది. దీనిపై అధికారులు చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండట్లేదు. సర్వే సక్రమంగా చేయలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు



ధన్వంత్ (పాత చిత్రం)

పరిటాల(కంచికచర్ల), న్యూస్‌టుడే : మండలంలోని పరిటాల సమీపంలో రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఒక యువకుడు మృత్యువాత పడగా, మరొక ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం జరిగింది. ఎస్సై బి.రాజు, బాధితుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... వీరులపాడు మండలం వెల్లంకి గ్రామానికి చెందిన వేల్పూరి ధన్వంత్(19), అచ్చి ఫణి కుమార్‌లు స్నేహితులు. ఫణి కుమార్‌కు కంచికచర్ల మండలం పరిటాలలో వ్యక్తిగత పని ఉండడంతో ద్విచక్ర వాహనంపై వెళుతూ తన స్నేహితుడు ధన్వంత్, అదే గ్రామానికి చెందిన మరొక యువకుడు ఇమ్రాన్‌ను వెంట తీసుకొని వెళ్లాడు. పరిటాలలో పని ముగించుకొని తిరిగి వస్తుండగా, పొలంలో పనులు ముగించుకొని రహదారిపైకి వచ్చి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వీరి ద్విచక్ర వాహనం బలంగా ఢీకొనడంతో ముగ్గురు రహదారిపై పడిపోయారు. ధన్వంత్, ఫణి కుమార్‌లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం విజయవాడ తరలించగా, ధన్వంత్ ఆసుపత్రిలో మృతి చెందాడు. ఫణి కుమార్ పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు బంధువులు తెలిపారు. మరొక యువకుడు ఇమ్రాన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతి చెందిన ధన్వంత్ బెంగళూరులోని ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతూ, దసరా సెలవులకు ఇంటికి వచ్చినట్లు బంధువులు తెలిపారు. మృతుని తండ్రి రామాచారి కంచికచర్ల మండలం పెండ్యాలలోని ఒక బ్యాంకులో బంగారం నాణ్యత పరిశీలకుడిగా విధులు నిర్వహిస్తాడు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య హామీ ఇచ్చారు. చిల్లకల్లు మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలు, దివ్యాంగుల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజా వేదికలో ఇళ్ల స్థలాలు, పింఛన్లు, గత ప్రభుత్వ ఇంటి బిల్లులు, విద్యుత్తు, నీళ్ల సమస్యలపై అధికంగా 111 అర్జీలు వచ్చాయని తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయని పేర్కొన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పీజీఆర్ఎస్ ద్వారా 30 రోజుల లోపు పరిష్కరిస్తానన్నారు. ఎంపీడీవో జి.నితిన్, పార్టీ మండల అధ్యక్షుడు కట్టా వెంకట నరసింహారావు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోండి

ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని మూలపాడు, కేతనకొండ, కొటికలపూడి గ్రామాల్లో తెదేపా మండల శాఖ ఆధ్వర్యంలో ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెదేపా మండలాధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ 2021 అక్టోబరు ముందు డిగ్రీ పూర్తి చేసిన వారందరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు.

సీసీ రహదారుల నిర్మాణానికి శ్రీకారం



మునగచర్లలో శంకుస్థాపన పూజలో ఎమ్మెల్యే సౌమ్య, నాయకులు

నందిగామ గ్రామీణం: మండలంలోని ఐతవరం గ్రామంలో శుక్రవారం రూ.20 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించే సిమెంటు రహదారి పనులకు మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాయుడు ఉదయలక్ష్మి, తెదేపా మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి, మద్దుకూరు రామారావు, యరమాస అంకురావు తదితరులు పాల్గొన్నారు. మునగచర్ల గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.20 లక్షలతో నిర్మించే సిమెంటు రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్-6 పథకాలను అమలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నరసింహయ్య, కూటమి నాయకులు చిరుమామిళ్ల శ్రీనివాసరావు, తొర్లికొండ సీతారామయ్య, కొల్లూరు నాగేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే 'ప్రజా దర్బార్'

కంచికచర్ల : ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు నేడు(శుక్రవారం) కంచికచర్ల తెదేపా కార్యాలయంలో ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు తెదేపా కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఉచిత ఇసుక అందుబాటులో ఉంచాలి



నందిగామలో నాయకుల ధర్నా

నందిగామ, న్యూస్‌టుడే: ఎన్డీయే ప్రభుత్వం వెంటనే ఉచిత ఇసుక అందుబాటులో ఉంచాలని సీపీఎం మండల కార్యదర్శి కటారపు గోపాల్ కోరారు. స్థానిక గాంధీ సెంటర్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని కోరుతూ శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు ధర్నా చేశారు. ఈసందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ఇసుక లేకపోవటం వల్ల భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీనిపై ఆధారపడి ఎన్టీఆర్ జిల్లాల్లో 36 రకాల వృత్తులకు చెందిన 1.50 లక్షల మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. ఇసుక కొరత, అధిక ధరలు వల్ల భవన నిర్మాణ రంగంలో పనులు ముందుకు సాగట్లేదని తెలిపారు. ఉచిత ఇసుక పేరు చెప్పి రవాణా ఛార్జీల భారం మోపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఖాసీం, గోపీనాయక్, వెంకటేశ్వరరావు, లాజరు, పుల్లయ్య, దానయ్య, సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయాలని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని సిబ్బంది వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఎస్.రామనాథం మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉచిత ఇసుక అందించి వారిని ఆదుకోవాలని కోరారు. నాయకులు కృష్ణ, శేషు, గౌస్‌మియా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఔట్లపై చర్యలు లేనట్లేనా?

మోసపోయామంటున్న కొనుగోలుదారులు


● చర్యలు తీసుకోని అధికార యంత్రాంగం

వత్సవాయి, పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

'వత్సవాయికి చెందిన శ్రీనివాసరావు ఉపాధి కోసం తన కుటుంబంతో కలిసి పదేళ్ల క్రితం ఖమ్మం వెళ్లారు. కష్టపడి పనుల చేసి సంపాదించిన కొంత డబ్బులతో రెండేళ్ల క్రితం వత్సవాయిలో ఇల్లు కట్టుకోవాలనే ఆశతో రోడ్డు పక్కన వేసిన లేఔట్‌లో నాలుగు సెంట్ల స్థలం కొన్నాడు. ఇటీవల ఇంటి నిర్మాణానికి అనుమతులు కావాలని పంచాయతీ కార్యాలయంలో సంప్రదిస్తే లేఔట్‌కు ప్రభుత్వ అనుమతి లేదని, అందువల్ల ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వలేమని అధికారులు తేల్చి చెప్పడంతో శ్రీనివాసరావు నివ్వెరపోయాడు. తాను మోసపోయానని తెలుసుకొని లబోదిబోమంటున్నాడు' ఇది ఒక్క శ్రీనివాసరావు సమస్యే కాదు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో వందలాది లేఔట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వేలాది మంది ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్య.

పట్టించుకోని అధికారులు..

నియోజకర్గంలో గడిచిన ఐదేళ్లలో అక్రమ లేఔట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా అధికారులు నోరుమెదపలేదు. అధికారుల అండదండలతో నిబంధనలను కాలరాస్తు లేఔట్లు వేసి జోరుగా విక్రయాలు చేశారు. ముందుగా స్థలం కొనుక్కుంటే తర్వాత నెమ్మదిగా ఇల్లు కట్టుకోవచ్చనే ఆలోచనలతో ఉన్న మధ్య తరగతి ప్రజలు ఎగబడి ప్లాట్లు కొనుగోలు చేశారు. తీరా ఇపుడు ఇల్లు కట్టుకుందామంటే అనుమతులు ఇచ్చేందుకు అధికారులు నిరాకరించటంతో ఆందోళన చెందుతున్నారు.



పెనుగంచిప్రోలులో ఓ లేఔట్ వద్ద సీఆర్‌డీఏ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

రోడ్డు వెంబడి ఇష్టారాజ్యం

నియోజకవర్గంలో 65వ నంబరు జాతీయ రహదారి, చిల్లకల్లు-వైరా రోడ్డు, మక్కపేట-పెనుగంచిప్రోలు రహదారి ఇలా ప్రధాన రహదారులతో పాటు, గ్రామాల్లో సైతం విచ్చలవిడిగా భూములు కొనుగోలు చేసి ప్లాట్లుగా విభజించి విక్రయాలు చేశారు. జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న తొర్రగుంటపాలెం చుట్టూ లెక్కకుమించిన వెంచర్లు వేశారు.

విచ్చలవిడిగా ప్లాట్ల విక్రయాలు

గత ప్రభుత్వం హయంలో పొలాల ధర దారుణంగా పడిపోవటంతో తక్కువ ధరలకు పొలాలు కొనుగోలు చేసి ప్లాట్లుగా విక్రయించారు. జాతీయ రహదారిపై ఉన్న చిల్లకల్లు, తోటచర్ల వద్ద విచ్చలవిడిగా ప్లాట్ల విక్రయాలు చేశారు. వత్సవాయిలో వైరారోడ్డుకు వ్యాపార సముదాయలు రావటంతో రహదారికి ఇరువైపులా ఇళ్లు కట్టుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీనిని అదునుగా చేసుకొని ఎక్కడబడితే అక్కడ ప్లాట్ల వ్యాపారం చేశారు.



పెనుగంచిప్రోలులో మక్కపేట రోడ్డులోని లేఔట్

కళ్లు తెరవని అధికారులు

తిరుపతమ్మ ఆలయంతో రాష్ట్రంలోనే పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన పెనుగంచిప్రోలులో సైతం అక్రమ లేఔట్లు వెలిశాయి. గత ప్రభుత్వంలో రహదారి పక్కనే వేసిన లేఔట్‌కు ఇటీవల సీఆర్‌డీఏ అధికారులు నోటీసులు జారీ చేసి లేఔట్‌లో ప్లాట్లు కొనరాదని పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయటంతో ఇప్పటికే స్థలాలు కొనుగోలు చేసినవారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లతెరచి నిబంధనలు అమలు చేసి ప్రజలు మోసపోకుండా చర్యలు తీసుకోవాలి.

త్రిశక్తి స్వరూపిణి.. అభయ ప్రదాయిని



నందిగామ గ్రామీణం: దుర్గానగర్ దుర్గమ్మ



నందిగామ శివాలయంలో..



అంబారుపేటలో..



గాయత్రిదేవిగా దర్శనమిస్తున్న వాసవీమాత



పల్లగిరిపై గాయత్రిగా కనకదుర్గమ్మ




చందర్లపాడులో..



తూర్పుబజారులో



నవాబుపేటలో



డౌన్‌సెంటర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

నందిగామ గ్రామీణం, పెనుగంచిప్రోలు, నందిగామ, చందర్లపాడు, వీరులపాడు, న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రుల్లో రెండోరోజు శుక్రవారం అమ్మవార్లు పలుచోట్ల గాయత్రిగా, బాలా త్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో కుంకుమార్చనలు, విశేష పూజలు నిర్వహించారు. నందిగామ శివాలయంలో శుక శ్యామలాంబ బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. అంబారుపేట సత్యమ్మతల్లిని శుక్రవారం దేవాదాయశాఖ జిల్లా పూర్వ సహాయ కమిషనర్ శాంతి, ఆ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కల్యాణ్ తదితరులు దర్శించుకున్నారు.



పల్లగిరిపై కుంకుమార్చనలో మహిళలు

ఆర్డీవోకు సన్మానం

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చేపట్టనున్న సేవా కార్యక్రమాలకు సహకరించాలని ఆర్డీవో కె. బాలకృష్ణ ను సొసైటీ ప్రతినిధులు కోరారు. శుక్రవారం నందిగామ సబ్‌బ్రాంచి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ పారేపల్లి సాయిబాబు, కార్యదర్శి పటాపంచల రామారావు లు నూతన ఆర్డీవోను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

లిడ్‌కాప్ ఛైర్మన్‌కు సత్కారం

ఎ.కొండూరు: రాష్ట్ర తోళ్ల పరిశ్రమ అభివృద్ధి సంస్థ (లిడ్‌కాప్)ఛైర్మన్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన పిల్లి మాణిక్యాలరావును తాడేపల్లి కార్యాలయంలో పోలిశెట్టిపాడుకు చెందిన మాజీ ఎంపీపీ, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి వాసం మునియ్య శాలువతో సత్కరించారు. లిడ్‌కాప్ ద్వారా పేదలకు ఉపాధి కల్పించేందుకు, వారి ఆర్థికాభివృద్ధికి మాణిక్యాలరావు కృషి చేయాలని కోరారు.

విజయవాడ పశ్చిమ

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నాం


మాట్లాడుతున్న విజయవాడ పార్లమెంటు సభ్యులు శివనాథ్ (చిన్ని)


గన్నవరం ఎమ్మెల్యే వెంకట్రావు

చిట్టినగర్, న్యూస్‌టుడే : రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని జగన్మాతను వేడుకున్నట్లు విజయవాడ, అమలాపురం పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), గంటి హరీష్‌మాథుర్ తెలిపారు. శుక్రవారం ఇంద్రకీలాద్రిపై గాయత్రీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను ఎం.పి.లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సంపద సృష్టి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు తలపెడుతున్న ప్రతి కార్యక్రమానికి దుర్గమ్మ అనుగ్రహం ఉండాలని ప్రార్థించినట్లు చెప్పారు. ఉత్సవ ఏర్పాట్లు భక్తులే కాకుండా అధికార, ప్రతిపక్ష నేతలు కూడా ప్రశంసిస్తున్నారని అన్నారు. దుర్గమ్మను రాష్ట్ర మంత్రి టి.జి. భరత్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వేర్వేరుగా దర్శించుకున్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో జీవనం సాగేలా అమ్మ ఆశీస్సులు ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు

ఉచిత క్యూలైన్లలో వానరం

చిట్టినగర్, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాతను దర్శించుకునేందుకు ఏర్పాటు చేసిన ఉచిత క్యూలైన్లో వానరం హడావుడి చేసింది. ఇంద్రకీలాద్రిపై రాజగోపురం సమీపంలోని గోశాల వద్ద క్యూలైన్ల గ్రిల్స్‌పై కూర్చుని కాసేపటికి దిగిపోవడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.


నేను అమ్మ దర్శనానికి వస్తా అంటూ క్యూలైన్‌పై కూర్చున్న కోతి

జగన్మాత సేవలో ప్రముఖులు


క్యూలైన్లో భక్తులతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర


జస్టిస్ హరినాథ్‌కు ప్రసాదం అందజేస్తున్న వేదపండితుడు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. అధికారులు వారికి ఆలయమర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం వేదపండితులు ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

క్యూలైన్లో ఇబ్బందులు తెలుసుకున్న మంత్రి కొల్లు రవీంద్ర

దసరా ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం చేసిన ఏర్పాట్లను మంత్రి కొల్లు రవీంద్ర క్యూలైను మొదలు కనకదుర్గానగర్ వరకు శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఏర్పాట్లపై భక్తుల స్పందనను తెలుసుకున్నారు. వేసవి తీవ్రత కారణంగా క్యూలైన్లలో గాలి సరిపోక పడుతున్న ఇబ్బందులను భక్తులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇబ్బందులను దేవస్థానం ఈవో రామరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు.

అనకాపల్లి ఎంపీ, మాజీ ఎమ్మెల్సీ

ఇంద్రకీలాద్రిపై గాయత్రీదేవి అలంకారంలో ఉన్న జగన్మాత దుర్గమ్మను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న వేర్వేరుగా శుక్రవారం దర్శించుకున్నారు. అధికారులు వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వెంకన్న నగరోత్సవంలో పాల్గొని ఆదిదంపతుల పల్లకీని మోశారు. స్థానాచార్య శివప్రసాదశర్మ పాల్గొన్నారు.

అమ్మ సేవలో మేము సైతం

దివ్యాంగులు, వృద్ధులకు ఆసరాగా వాలంటీర్లు, విద్యార్థులు


వీల్‌చైర్‌లో దర్శనానికి తీసుకెళ్తున్న వాలంటీర్లు

చిట్టినగర్, న్యూస్‌టుడే

దేవీశరన్నవరాత్రుల మహోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా అమ్మ దర్శనానికి తరలి వస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు, వివిధ కారణాలతో నడవలేని వారికి అమ్మవారి దివ్యదర్శనం అందించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేకంగా వాలంటీర్లను ఏర్పాటు చేశారు. అవసరమైన వారు ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని కోరుతున్నారు. వచ్చిన వారిని వీల్ ఛైర్లలో తీసుకెళ్లి దర్శనం అనంతరం మళ్లీ కొండ దిగువకు చేరుస్తున్నారు. క్యూమార్గంలో ఇంద్రకీలాద్రికి చేరుకునే భక్తులకు వాటర్ ప్యాకెట్లు అందిస్తూ దాహార్తి తీరుస్తూ అమ్మ సేవలో తరిస్తున్నారు. పోలీస్ సేవాదళ్, ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ వాలంటీర్లు తమ అభిప్రాయాలు ఇలా వ్యక్తం చేస్తున్నారు.

సెలవులు వృథా కాకుండా



ఇంటర్ చదువుతున్నాం. సెలవులు వృథా చేయకుండా దుర్గమ్మకు, భక్తులకు సేవ చేసే అవకాశం దక్కింది. ఈ పది రోజులు అమ్మ సేవలో తరిస్తాం. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర వ్యాధులతో బాధపడే వారిని వీల్ ఛైర్లలో దర్శనానికి తీసుకెళ్లడం మా సేవకు భక్తులు సంతోషపడుతుంటే మా ఇంట్లో వారికి చేసిన భావన కలిగింది.

- సూర్యకిరణ్, మహేంద్ర, ఇంటర్ విద్యార్థులు

ఆనందంగా ఉంది



దసరా ఉత్సవాలలో అమ్మ సన్నిధిలో సేవ చేయడం మాకు ఆనందంగా ఉంది. భక్తులకు తాగునీరు అందించడం, వీల్ ఛైర్లలో దర్శనానికి తీసుకెళ్లడం. కొండపైన, దిగువన భక్తులు ప్రసాదం కౌంటర్లు, అన్నప్రసాదం అందించే ప్రాంత సమాచారం చెప్పడం వంటి విధులు నిర్వహిస్తున్నాం. సహజంగా మా వయసు వారికి పోలీసు లంటే భయం ఉంటుంది. అలాంటిది వారితో సమాచారాన్ని పంచుకోవడం, వారి సహకారం తీసుకుని భక్తులకు సేవలందించడం స్నేహ భావం కూడా మాలో పెంపొందింది.

- రాజరాజేశ్వరీ, మేఘన, బీటెక్ విద్యార్థులు

సేవ చేసుకునే భాగ్యం కలిగింది



మేం ఆర్మ్‌డ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగం చేస్తున్నాం. మాకు ఇంద్రకీలాద్రిపై సేవ చేసుకునే అవకాశం దక్కింది. జగన్మాతను దర్శించుకోవాలని ఇంటి దగ్గర నుంచి ఎన్నో బాధలు పడుతూ వృద్ధులు, దివ్యాంగులు కొండకు చేరుతున్నారు. వారిని ఎక్కడా ఇబ్బంది పెట్టకుండా చూడాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఆ విధంగానే మేము వారిని ఎస్కలేటర్ ఛైర్‌లో కూర్చోబెట్టుకుని అమ్మ దర్శనం చేయిస్తున్నాం. వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- శిరీష్, షకీనా, మహిళా కానిస్టేబుళ్లు(ఏఆర్)

ఉత్సాహంగా ఉంది



తొలిసారిగా దుర్గమ్మ సేవకు ఇంద్రకీలాద్రికి వచ్చాం. భక్తుల దాహార్తి తీర్చేందుకు నిత్యం వాటర్ ప్యాకెట్లు అందిస్తున్నాం. మెడికల్‌గా ఇబ్బంది పడే వారిని వైద్యశిబిరాలకు తీసుకెళ్లి వైద్యం అందిస్తుంటే ఆ భక్తుల్లో ఆనందం, వారు మాపట్ల చూపుతున్న ఆదరణ చూస్తే ఆత్మసంతృప్తిగా ఉంటోంది. ఇంకా సేవ చేయాలనే ఉత్సాహం, ఆకాంక్ష మాలో పెరిగింది.

- నాగభవానీ, భువనకీర్తి, బీటెక్ విద్యార్థినులు

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ రాజశేఖర్ బాబు


క్షేత్రస్థాయి పరిస్థితిపై ఈవో రామారావుతో మాట్లాడుతున్న సీపీ రాజశేఖర్‌బాబు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో రెండో రోజు శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనానికి తరలిరావడంతో భద్రతా ఏర్పాట్లను సీపీ రాజశేఖర్‌బాబు శుక్రవారం పరిశీలించారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులు, సిబ్బంది, దేవస్థానం ఉద్యోగులతో తలెత్తిన వివాదాలను పురస్కరించుకొని సీపీ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఈవో రామారావు పాల్గొన్నారు.

✤ దసరా ఉత్సవాల్లో వివిధ పూజలు, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా శుక్రవారం రూ. 38.22లక్షల ఆదాయం వచ్చింది. రూ.500టిక్కెట్ల ద్వారా రూ.15, 08,500, రూ.300 టిక్కెట్ల ద్వారా రూ.4,73,100, రూ.100 టిక్కెట్ల ద్వారా 3,72,400 ఆదాయం వచ్చింది. లడ్డూల విక్రయాల ద్వారా 12,36,675 ఆదాయం లభించింది.

దుర్గమ్మకు సంగీత నీరాజనం


వీణతో అమ్మవారి కీర్తనలు పలికిస్తున్న మంచెం అన్నపూర్ణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం కనకదుర్గానగర్‌లోని కళావేదికపై జగన్మాతకు పలువురు కళా నీరాజనం అందించారు. దుర్గామల్లేశ్వరులపై భాస్కర వెంకట దత్తాత్రేయ శర్మ రచించిన భవానీ శరణుఘోష, అన్నమాచార్య, అమ్మవారి కీర్తనలను వీణపై వీనుల విందుగా మల్లికార్జునపేటకు చెందిన కళాకారిణులు మంచెం అన్నపూర్ణ, లక్ష్మీనాగమల్లీశ్వరి ప్రదర్శించారు. జగన్మోహని వాద్య సహకారం అందించారు. జాతీయ అవార్డుల గ్రహీత హైదరాబాద్‌కు చెందిన జి. రాధాశివాని ప్రదర్శించిన భరత నాట్యం, కూచిపూడి కళాకారిణుల రాధాకృష్ణుల నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.

ఇంద్రకీలాద్రిపై ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి!

✤ ఫ్యాన్లు లేక భక్తులు, వైద్య సిబ్బంది అవస్థలు


కర్చీఫ్‌లతో విసురుకుంటున్న వైద్యులు


నీరసంతో కుప్పకూలిన భక్తురాలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై ఉక్కపోతతో క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు శుక్రవారం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎండతోపాటు ఉక్కపోత అధికంగా ఉండటంతో క్యూలైన్లో ఉన్న భక్తులు గాలి ఆడక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. డోనార్ సెల్ వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో వైద్యులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. గాలి లేకపోవడంతో చేతిరుమాళ్లతో విసురుకోవడం కనిపించింది. దేవస్థానం క్యూలైన్లో ఏర్పాటు చేసిన కూలర్లు సైతం పనిచేయని పరిస్థితి ఏర్పడింది. క్యూలైన్లో ఉన్న భక్తులు నీరసించి పడిపోవడంతో ఆంబులెన్సు సిబ్బంది అత్యవసర చికిత్సలు అందించారు. ఈ విషయాన్ని దేవస్థానం ఈవో రామారావు దృష్టికి తీసుకురాగా యుద్ధప్రాతిపదికన క్యూలైన్ల వద్ద స్టాండ్‌ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాట్లు చేయమని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

కదిలారు.. నేల పట్టాలు వేశారు



స్పందనకు వందనం

చిట్టినగర్, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు కాళ్లు కాలకుండా అధికారులు చర్యలు చేపట్టారు. 'మండుతున్న ఎండలు.. కాలుతున్న కాళ్లు' శీర్షికన ఈ నెల 4వ తేదీన 'ఈనాడు'లో చిత్ర వార్త ప్రచురితమైంది. అధికారులు స్పందించారు. దర్శనం చేసుకుని కొండ దిగే భక్తులకు మహామండపం నుంచి ప్రసాదం కౌంటర్ల వరకు కాళ్లు కాలకుండా ఉండేందుకు వీలుగా నేల పట్టాలు వేశారు. భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత బస్సు సౌకర్యం అందరికీ కల్పించరూ..!


కృష్ణవేణి ఘాట్ పరిసరాల్లో టిక్కెట్ల కొనుగోలు కేంద్రం


కృష్ణవేణి ఘాట్ వద్ద దేవస్థానం బస్సు

కృష్ణలంక, న్యూస్‌టుడే: కనక దుర్గమ్మ దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా దేవస్థానం అధికారులు కృష్ణవేణి ఘాట్ పరిసరాల్లో దర్శనం టిక్కెట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కౌంటర్లలో రూ.300, రూ.500ల దర్శనం టిక్కెట్లు విక్రయిస్తున్నారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో దసరా వేడుకల నిర్వహణలో భాగంగా మహిళలు, వృద్ధులు, పిల్లల కోసం దేవస్థానం సీతమ్మవారిపాదాల సెంటర్ నుంచి కొండపైన ఆలయం వరకు ఉచిత బస్సును ఏర్పాటు చేసింది. అనంతరం వైకాపా పాలనలో నిర్వహించిన వేడుకల్లో ఉచిత బస్సును ఏర్పాటు చేసినప్పటికీ అది కేవలం రూ.300లు, రూ.500ల దర్శనం టిక్కెట్లను కొనుగోలు చేసిన వారికి మాత్రమే పరిమితం చేయడంతో గతంలో విమర్శలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం అందుకు భిన్నంగా కేవలం రూ.500లు టిక్కెట్లను కొనుగోలు చేసిన వారికి, వృద్ధులకు, దివ్యాంగులకు మాత్రమే ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడంతో మహిళలు, చిన్నారులు నిరాశ చెందుతున్నారు. ఒక పక్క ఎండలకు బెంబేలెత్తుతున్న భక్తులు ఉచిత బస్సును కొందరికే పరిమితం చేయడంపై పెదవి విరుస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల్లో అధికులు పీఎన్‌బీఎస్‌లో బస్సులు దిగి సీతమ్మవారిపాదాల సెంటర్‌కు చేరుకుని కేశఖండనశాలలో తలనీలాలు సమర్పించి దర్శనానికి వెళుతున్న కారణంగా ఉచిత బస్సును మహిళలకు, పిల్లలకు కూడా కొనసాగించాల్సిందిగా భక్తులు కోరుతున్నారు.

అమ్మ రూపం.. అపురూపం

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


హెచ్‌బీకాలనీలో గాయత్రీ దేవిగా అమ్మవారు


శ్రీబాలాత్రిపురసుందరీ దేవిగా మహాలక్ష్మి


పాలఫ్యాక్టరీ వద్ద గాయత్రీదేవిగా


కొత్తపేట గంగానమ్మ తల్లి


వీఎంసీ కాలనీలో


దాసాంజనేయ ఆలయంలో

చిట్టినగర్, న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. చిట్టినగర్‌లోని నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గాయత్రీదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. కేంద్ర ఆర్థిక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొప్పురావూరి రోహిన్ అమ్మవారిని దర్శించుకున్నారు. పాలఫ్యాక్టరీ వద్ద విజయదుర్గా ఆలయంలో, వీఎంసీ కాలనీలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో కొత్తపేట గంగానమ్మ అమ్మవారి ఆలయంలో, దాసాంజనేయస్వామివారి ఆలయంలో, అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బెజ్జాలమేడ వీధిలో జరుగుతున్న దసరా ఉత్సవాలలో శుక్రవారం భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. చిట్టినగర్ ఆలయంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భరదవేదం నృత్య రపకం విశేషంగా ఆకట్టుకుంది.

భవానీపురం, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాల్లో గాయత్రీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సంకల్ప సిద్ధి శ్రీ శిర్డీ సాయిబాబా మందిరంలో భక్తులు పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.


బెజ్జాలమేడ వీధిలో అమ్మవారి ఉత్సవాల్లో శ్రీరామ్


భరతవేదం నృత్య రూపకం


అమ్మవారి కీర్తనకు నర్తన

తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

భవానీపురం, న్యూస్‌టుడే : అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో వచ్చే భక్తులకు తాగునీటి ప్యాకెట్లు అందించాలని, ఏ ఒక్కరికీ ఇబ్బంది కలగకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో టెలికాన్ఫరెన్స్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన పాయింట్‌లో కచ్చితంగా ఉండాలన్నారు. ఎక్కడా లోపం లేకుండా చూడాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వ్యర్థాలు లేకుండా చూడాలని, డ్రోన్ల ద్వారా పరిశీలించాలన్నారు.

అధికారులపై విచారణకు ఆదేశిస్తూ ఉత్తర్వులు

భవానీపురం, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న, గతంలో పని చేసిన అధికారులపై విచారణకు ఆదేశిస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అధికారుల్లో కొందరు ఉద్యోగ విరమణ చేయగా, మరికొందరు వేరే ప్రాంతంలో పని చేస్తున్నారు. ఆయా అధికారులు పని చేసిన సమయంలో కొన్ని అవకతవకలు జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో విచారించి చర్యలు చేపట్టాలంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బి.గురునాథ బాబు, ఈఈ పి.వి.కె.భాస్కర్, డీఈఈ జే.శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజినీరు ఎన్.రామారావు, డి.రాజేశ్వరరావు, విశ్రాంత ఈఈ ఎం.ఈషాక్ ప్రభాకర్ హయాంలో జరిగిన పనుల్లో పలు అవకతవకలు జరిగినట్లు గుర్తించారు.

రద్దీగా బస్టేషన్


విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా పాఠశాలలు, కళాశాలకు సెలవులు ప్రకటించడంతో స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికులతో పండిట్‌నెహ్రూ బస్టేషన్‌లో శుక్రవారం రద్దీ నెలకొంది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. రాయలసీమకు 32, ఇతర ప్రాంతాలకు రద్దీని బట్టి 20 సర్వీసులు ఏర్పాటు చేశామని ప్రయాణికుల రద్దీ పెరిగితే మరిన్ని బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్‌మేనేజర్ నర్రా శ్రీనివాసరావు తెలిపారు.


క్లోక్‌రూం వద్ద గుట్టలుగా బ్యాగులు


బస్సుల కోసం మెట్ల వద్ద పడిగాపులు


బస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీసీటీఎం శ్రీనివాసరావు

వ్యాపార రంగంలో బలమైన పునాదులు వేసుకోవాలి


మాట్లాడుతున్న రామచంద్రప్రభు

చిట్టినగర్, న్యూస్‌టుడే : వ్యాపార, వాణిజ్య రంగాల్లో యువ పారిశ్రామికవేత్తలు బలమైన పునాదులు ఏర్పరచుకోవాలని తులసీ గ్రూపు ఆఫ్ కంపెనీ ఛైర్మన్ తులసీ రామచంద్రప్రభు అన్నారు. కొత్తపేట కేబీఎన్ పీజీ కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో మీట్ ది సీఈవో ముఖాముఖీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు, ఉద్యోగులు, సరఫరాదారులు నాలుగు ప్రధాన వాటాదారులతో ఏ వ్యాపారమైనా విజయపథంలో ముందుకు సాగుతుందన్నారు. హిందూ హైస్కూల్ కమిటీ ఏవో నారాయణరావు, కళాశాల డైరెక్టర్ వెంకటేష్, ఎంబీఏ విభాగాధిపతి రవికిరణ్, యూజీ కామర్స్ విభాగాధిపతి హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి ఆర్య వైశ్యుల కృషి



చెక్కు అందజేస్తున్న మంత్రి భరత్, సంస్థ ప్రతినిధులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: సేవ అంటే గుర్తొచ్చేది ఆర్య వైశ్యులని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంబీ విజ్ఞానకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వరద బాధితుల ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 600 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున రూ.30 లక్షలను సంఘం అందజేస్తున్నట్లు చెప్పారు. సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అరవేటి నిర్మల, రాష్ట్ర [illegible] తమ వంతుగా రూ.3 లక్షలు విరాళంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

చాకుతో పొడిచి హత్య

చిట్టినగర్: వివాహిత విషయమై తలెత్తిన గొడవ హత్యకు దారి తీసిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. కొత్తపేట పోతినవారివీధిలోపల్లి సాయికుమార్(22) కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఓ యువతి విషయంలో యోహావా(అలియాస్ పెద్ద చిలా), సాయికుమార్ మధ్య కొంతకాలంగా గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 4వ తేదీన ఇదే విషయమై యోహావా అతని స్నేహితులు కలిసి సాయికుమార్‌ను కొట్టి చాకుతో పొడిచారు. రక్తస్రావమై పడిపోగా చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

తోపుడు బళ్ల వ్యాపారులను ఆదుకోండి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: బుడమేరు వరదల్లో వందలాది చిరువ్యాపారులు నష్టపోయారని, వారికి కూడా పరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. చిరు వ్యాపారులకు నష్టపరిహారం ఇస్తే వారు కూడా తిరిగి వ్యాపారాలు చేసుకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అన్వర్, వరప్రసాద్, సూరిబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ మధ్య

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

మధురానగర్, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల తనిఖీలు, మరమ్మతుల కారణంగా మధురానగర్ విద్యుత్తు సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శనివారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు పసుపులేటివారి వీధి, బాలాజీ వీధి, నేతాజీ వీధి, సాయిప్రసన్న వీధి, సాయిబాబా వీధి, కూనపురెడ్డి వీధి, మోహన్‌గాంధీ వీధి, గణపతి వీధి, గవిళ్ల వారి వీధి, కనపర్తి సుబ్బానాయుడు వీధి, బొమ్మసాని నారాయణరావు వీధి, కాకర్లమూడి వారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
63036 11232

? బందరు లాకుల సాయిబాబా గుడి వద్ద గల గోపాలస్వామి వీధిలో 23/08/24 నెంబరు విద్యుత్తు స్తంభానికి ఉన్న దీపం నెల రోజులుగా వెలగడం లేదు. దీపం ఏర్పాటు చేయగలరు. - శేఖర్, స్థానికుడు

✔ పరిశీలించి దీపం ఏర్పాటు చేస్తాం. - విమల, ఏఈ, వీఎంసీ.

మంచినీటి పైపునకు మరమ్మతులు

స్పందనకు వందనం

రామకృష్ణాపురం ఆంజనేయస్వామి గుడి దగ్గర మంచినీటి పైపులైన్ మరమ్మతుల కోసం ఫుట్ పాత్ తవ్వి వదిలేశారని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ద్వారా వీఎంసీ అధికారి అరుణ్‌దేవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి మంచినీరు వృథాగా పోకుండా మరమ్మతులు చేయించారు.
- సీతారాంపురం, న్యూస్‌టుడే

అమ్మ సేవలో మేము సైతం

దివ్యాంగులు, వృద్ధులకు ఆసరాగా వాలంటీర్లు, విద్యార్థులు


వీల్‌ఛైర్‌లో దర్శనానికి తీసుకెళ్తూ..

చిట్టినగర్, న్యూస్‌టుడే

దేవీశరన్నవరాత్రుల మహోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా అమ్మ దర్శనానికి తరలి వస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు, వివిధ కారణాలతో నడవలేని వారికి అమ్మ వారి దివ్యదర్శనం అందించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేకంగా వాలంటీర్లను ఏర్పాటు చేశారు. అవసరమైన వారు ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని కోరుతున్నారు. వచ్చిన వారిని వీల్ ఛైర్లలో తీసుకెళ్లి దర్శనం అనంతరం మళ్లీ కొండ దిగువకు చేరుస్తున్నారు. క్యూమార్గంలో ఇంద్రకీలాద్రికి చేరుకునే భక్తులకు వాటర్ ప్యాకెట్లు అందిస్తూ దాహార్తి తీరుస్తూ అమ్మ సేవలో తరిస్తున్నారు. పోలీస్ సేవాదళ్, ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ వాలంటీర్లు తమ అభిప్రాయాలు ఇలా వ్యక్తం చేస్తున్నారు.

సెలవులు వృథా కాకుండా



ఇంటర్ చదువుతున్నాం. సెలవులు వృథా చేయకుండా దుర్గమ్మకు, భక్తులకు సేవ చేసే అవకాశం దక్కింది. ఈ పది రోజులు అమ్మ సేవలో తరిస్తాం. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర వ్యాధులతో బాధ పడే వారిని వీల్ ఛైర్లలో దర్శనానికి తీసుకెళ్లడం మా సేవకు భక్తులు సంతోషపడుతుంటే మా ఇంట్లో వారికి చేసిన భావన కలిగింది.
- సూర్యకిరణ్, మహేంద్ర, ఇంటర్ విద్యార్థులు

ఆనందంగా ఉంది



దసరా ఉత్సవాలలో అమ్మ సన్నిధిలో సేవ చేయడం మాకు ఆనందంగా ఉంది. భక్తులకు తాగునీరు అందించడం, వీల్ ఛైర్లలో దర్శనానికి తీసుకెళ్లడం. కొండపైన, దిగువన భక్తులు ప్రసాదం కౌంటర్లు, అన్నప్రసాదం అందించే ప్రాంత సమాచారం చెప్పడం వంటి విధులు నిర్వహిస్తున్నాం. సహజంగా మా వయసు వారికి పోలీసులంటే భయం ఉంటుంది. అలాంటిది వారితో సమాచారాన్ని పంచుకోవడం, వారి సహకారం తీసుకుని భక్తులకు సేవలందించడం స్నేహ భావం కూడా మాలో పెంపొందింది.
- రాజరాజేశ్వరీ, మేఘన, బీటెక్ విద్యార్థులు

సేవ చేసుకునే భాగ్యం కలిగింది



మేం ఆర్మ్‌డ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగం చేస్తున్నాం. మాకు ఇంద్రకీలాద్రిపై సేవ చేసుకునే అవకాశం దక్కింది. జగన్మాతను దర్శించుకోవాలని ఇంటి దగ్గర నుంచి ఎన్నో బాధలు పడుతూ వృద్ధులు, దివ్యాంగులు కొండకు చేరుతున్నారు. వారిని ఎక్కడా ఇబ్బంది పెట్టకుండా చూడాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఆ విధంగానే మేము వారిని ఎస్కలేటర్ ఛైర్‌లో కూర్చోబెట్టుకుని అమ్మ దర్శనం చేయిస్తున్నాం. వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- శిరీష్, షకీనా, మహిళా కానిస్టేబుళ్లు(ఏఆర్)

ఉత్సాహంగా ఉంది



తొలిసారిగా దుర్గమ్మ సేవకు ఇంద్రకీలాద్రికి వచ్చాం. భక్తుల దాహార్తి తీర్చేందుకు నిత్యం వాటర్ ప్యాకెట్లు అందిస్తున్నాం. మెడికల్‌గా ఇబ్బంది పడే వారిని వైద్యశిబిరాలకు తీసుకెళ్లి వైద్యం అందిస్తుంటే ఆ భక్తుల్లో ఆనందం, వారు మాపట్ల చూపుతున్న ఆదరణ చూస్తే ఆత్మసంతృప్తిగా ఉంటోంది. ఇంకా సేవ చేయాలనే ఉత్సాహం, ఆకాంక్ష మాలో పెరిగింది.
- నాగభవానీ, భువనకీర్తి, బీటెక్ విద్యార్థినులు

'శాప్' ఛైర్మన్‌గా రవినాయుడు బాధ్యతల స్వీకరణ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్‌గా అనిమిని రవినాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి సమక్షంలో శాప్ వైస్ ఛైర్మన్, ఎండీ పీఎస్ గిరీశా పుష్పగుచ్ఛాన్ని అందించి బాధ్యతల స్వీకరణ దస్త్రంలో సంతకం చేయించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో తెదేపా కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైకాపా అధినేత జగన్.. విమర్శిస్తున్నారని మండిపడ్డారు. రవినాయుడు మాట్లాడుతూ శాప్‌ను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు. చెప్పారు. మంత్రులు రవీంద్ర, అనగాని, గద్దె రామ్మోహన్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'సురేఖ క్షమాపణ చెప్పాలి'

గాంధీనగర్: అక్కినేని కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణ మంత్రి కొండా సురేఖ క్షమాపణ చెప్పాలని అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, న్యాయవాది చీదెళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం కౌతాకళావేదికలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సినీ పరిశ్రమను రాజకీయాల్లోకి లాగడం సరికాదని.. ఇటువంటి వ్యాఖ్యలు చేసినందుకు తక్షణమే మంత్రి పదవి నుంచి సురేఖను తప్పించాలని డిమాండ్ చేశారు.

విజయవాడలో ఘంటసాల రాష్ట్ర మహాసభలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆలిండియా ఘంటసాల 13వ రాష్ట్ర మహాసభలు రెండు రోజుల పాటు విజయవాడలో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరెడ్డి, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు తెలిపారు. శుక్రవారం స్థానిక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అమరావతిలో ఘంటసాల 25 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, ఎన్టీఆర్, ఘంటసాలకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని కోరారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ మాదిరిగా కృష్ణానదికి ఇరువైపులా మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు. కమిటీ సభ్యులు చింతకాయల చిట్టిబాబు, డేవిడ్‌రాజు, ఆంజనేయరాజు, రామతీర్థ, శ్యామ్‌ప్రసాద్, బంగారు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోండి


ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే: బుడమేరు ఆక్రమణలను తొలగించి, పటిష్ఠం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుడమేరు వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించాలని కోరుతూ శుక్రవారం అజిత్‌సింగ్‌నగర్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఇప్పటివరకు చేసిన నష్ట గణనలో కొంత మంది పేర్లు నమోదు చేయలేదని, వారి పేర్లు కూడా చేర్చాలని డిమాండ్ చేశారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు మాట్లాడుతూ... అక్టోబరు 5 నాటికి అందరికీ ఆర్థిక సాయం అందిస్తామన్న ప్రభుత్వం ఇప్పటికీ చాలా మందికి డబ్బులు వేయలేదన్నారు. కొంత మంది పేర్లే నమోదు చేయలేదని గుర్తు చేశారు. కార్యదర్శివర్గ సభ్యుడు కె.వి.భాస్కరరావు మాట్లాడుతూ... కొంత మందిని మొదటి అంతస్తులో ఉన్నట్లు నమోదు చేసి రూ.10 వేలు మాత్రమే వేశారని, ఇటువంటి కేసులను పునః సమీక్షించాలని కోరారు. సెంట్రల్ ఎమ్మెల్యే తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బత్తుల శివకుమార్, నత్తా లక్ష్మీనారాయణ, ఎస్‌కే.బాషా, కంది ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం రాలేదంటూ రాస్తారోకో

మధురానగర్, న్యూస్‌టుడే: బుడమేరు వరదల్లో నష్టపోయినా.. పరిహారం ఇవ్వలేదంటూ న్యూరాజరాజేశ్వరి పేటకు చెందిన పలువురు బాధితులు శుక్రవారం అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద రాస్తారోకో చేశారు. దాదాపు 15 మంది బాధితులు రోడ్డుకు అడ్డంగా బైఠాయించారు. పెద్ద మొత్తంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారులకు సర్ది చెప్పారు. కొందరు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసు అధికారులు జోక్యం చేసుకుని ఆందోళనకారులకు సర్ది చెప్పి.. రెవెన్యూ అధికారులకు తెలియజేయాలని సూచించడంతో ఆందోళన విరమించారు. పోలీసులు ట్రాఫిక్‌ను సరి చేశారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం


బాధ్యతలు స్వీకరిస్తున్న శివశంకర్

మధురానగర్(విజయవాడ), న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉపాధి చూపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎం.ఎస్.ఎం.ఇ.డి.సి.) ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ ముత్యాలంపాడులోని ఎం.ఎస్.ఎం.ఇ. కార్యాలయంలో ఛైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పేరిట యువతను మోసం చేసిందని విమర్శించారు. ఎం.ఎస్.ఎం.ఇ. ద్వారా యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. ఉద్యోగాలంటే కేవలం ప్రభుత్వ కొలువులనే భావనను నిరుద్యోగ యువత విడనాడి ఎం.ఎస్.ఎం.ఇ. అందించే ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని పారిశ్రామికవేత్తలుగా స్థిరపడాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల హామీకి కట్టుబడి ఉందని, నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఎం.ఎస్.ఎం.ఇ.పై తనకు అవగాహన ఉందని, దేశంలో ఏడో స్థానంలో ఉన్న ఏపీని అత్యున్నత స్థానానికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎంఎస్ఎంఈ సెర్ప్ శాఖ అధికారి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బూతులు మాట్లాడే వైకాపా నాయకులకు ప్రాయశ్చిత్తం అంటే తెలియదని శివశంకరరావు పేర్కొన్నారు. మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన దీక్షపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.

ప్రకటన

NTR జిల్లా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన కొత్తపేట, సైకమువారివీధిలో నివాసిస్తులు అయిన మా క్లయింట్ భృగమళ్ళ వీరవెంకట నాగశ్రీనివాసరావుగారి భార్య భృగమళ్ళ సుజాతగారి యిచ్చినటువంటి సంజాయిషీ ప్రకారం యావన్మందికీ తెలియజేయునది ఏమనగా.
దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి సారిక పైడయ్యగారి కుమారుడు ఆంజనేయులుగారికి అతని తల్లిగారు అయిన అప్పాయమ్మగారు 21-04-2008 దఖలు పరచి రిజిస్టరు చేసియుంటిరి. దరిమిలా సదరు ఆంజనేయులుగారు మున్సిపల్ కార్పొరేషన్ నుండి బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ పొంది R.C.C. బిల్డింగ్ నిర్మించుకొని యుండెను. సదరు ఆస్తిని విక్రయించుటకు ప్రయత్నించగా అందుకు నాక్లయింట్ అంగీకరించి కొంత బయానాగా యిచ్చియుంటిరి. కావున సదరు ఆస్తిపై ఎవరికయినా ఏవిధమైన అభ్యంతరములు గానీ, ఆక్షేపణలుగానీ క్లయిములుగానీ ఉన్న యెడల సదరు అభ్యంతరములు అన్నియూ లిఖితపూర్వకంగా దిగువ చూపబడిన చిరునామాకి రిజిస్టరు పోస్టు ద్వారా 10 రోజులు లోపుగా తెలియపరచవలెను. తదుపరి వచ్చే ఆక్షేపణలు గానీ, క్లయిములుగానీ చట్టపరంగా చెల్లవు మరియు అంగీకరించబడవు.
షెడ్యూలు ఆస్తి: యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి యిలాకా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన విజయవాడ నగరం అజిత్‌సింగ్‌నగర్ గల ఆస్తికి ముత్యాలంపాడు గ్రామం రీసర్వే నెం. 17, పార్ట్ దర్మిలా సబ్‌డివిజన్ కాబడిన రీత్యా రీ.సర్వే. నెం.17/1, పాత మున్సిపల్ వార్డు నెం. 21/3, ప్రస్తుత మున్సిపల్ వార్డు నెం. 52రు బ్లాక్ నెం. 71 ప్లాటు నెం. 1795రు, పాత అసెస్‌మెంట్ నెం. 465218, ప్రస్తుత అసెస్‌మెంట్ నెం. 1073170338, డోరు నెం. 42-71-5 దాఖల చ.గ. 133.1/3ల స్థలం అందులోని ఆర్.సి.సి. కట్టడములతో సహా ఆస్తికి **హద్దులు: తూర్పు:** ప్లాటు నెం. 1796 దాఖలా ఆస్తి హద్దు, **దక్షిణం:** రోడ్డు, **పడమర:** ప్లాటు నెం. 1794రు దాఖలా ఆస్తి హద్దు, **ఉత్తరం:** ప్లాటు నెం. 1818 దాఖలా ఆస్తి హద్దు.
పి.శేషమోహన్, అడ్వకేట్
గోపువారివీధి, గవర్నరుపేట, విజయవాడ-2

గాయత్రీమాత.. నమోస్తుతే!


కస్తూరిబాయిపేటలోని ముత్యాలమ్మ తల్లి గుడిలో ..

మధురానగర్, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు అమ్మవారు గాయత్రిదేవిగా భక్తుల పూజలు అందుకున్నారు. దేవాలయాలు, ఉత్సవ వేదికలపై అంగరంగ వైభవంగా అమ్మవారిని అలంకరించారు. కుంకుమ పూజలు కనులపండువగా నిర్వహించారు. మధురానగర్‌లో దసరా ఉత్సవాలు కనుల పండువగా చేస్తున్నారు. మెయిన్‌రోడ్డులో, కొబ్బరితోట కూడలిలోని అమ్మవారి పూజా వేదికలు, నేతాజీకాలనీలోని అంకమ్మతల్లి శక్తి పీఠం భక్తులతో కళకళలాడింది. గవర్నర్‌పేటలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో మాత్రం అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దావుబుచ్చయ్యకాలనీలోని శ్యామలాంబ ఆలయంలో గాయత్రిదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

సత్యనారాయణపురం: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజున దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, దుర్గాభవానీ సమేత నీలకంఠేశ్వర పీఠం, అయోధ్యనగర్‌లోని శ్రీధర్మపరిషత్ సంస్థానంలోని శివకామేశ్వరి సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయం, ముత్యాలంపాడులో పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, సత్యనారాయణపురం, అయోధ్యనగర్‌ల్లోని ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే: ముత్యాలంపాడులోని శిర్డీ సాయిబాబా పుణ్యతిథి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామికి పెరుగుతో అభిషేకం నిర్వహించారు. అనంతరం సాయినాథ దుర్గ హోమం చేశారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను మందిర గౌరవాధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోశాధికారి శ్రీహరి, సాయి సేవకులు పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన చిన్నారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


గవర్నర్‌పేటలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో..


దావుబుచ్చయ్యకాలనీలోని శ్యామలాంబ ఆలయంలో


సత్యనారాయణపురంలో ...


అయోధ్యనగర్ శ్రీధర్మపరిషత్ ఆవరణలోని శివకామేశ్వరి ఆలయంలో హారతి స్వీకరిస్తున్న ఎంపీ బాబూరావు


మధురానగర్ కొబ్బరితోట వద్ద అమ్మవారికి పూజలు


ముత్యాలంపాడులో బాలాత్రిపురసుందరీదేవిగా..

ఇంజినీర్ల సమస్యలు వెంటనే పరిష్కరించండి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు, పంచాయతీరాజ్ విభాగాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఇంజినీర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్ల ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు కాకి విజయబాబు కోరారు. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ జిల్లాల ఐకాస నాయకులతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జలవనరుల శాఖలో గత ఆరేళ్లుగా వివిధ కారణాలతో ఉద్యోగోన్నతులు ఇవ్వడం లేదని, డిపార్టుమెంట్ సీనియారిటీ కూడా తయారు చేయడం లేదని చెప్పారు. ఇదే సమస్య తెలంగాణలో ఉన్నప్పటికీ... వారు సమస్యను అధిగమించి క్రమం తప్పకుండా ఉద్యోగోన్నతులు చేపట్టారని గుర్తు చేశారు. ఏపీ ఇరిగేషన్ శాఖలో ఉద్యోగ విరమణల కారణంగా 70 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నా.. ఉద్యోగోన్నతులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 నుంచి 2019 మధ్య ఇంజినీర్లపై విజిలెన్స్ కేసులు పెట్టిన దృష్ట్యా.. ఆ కేసులను పక్కన పెట్టి తాత్కాలిక అడ్‌హక్ ప్రమోషన్స్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఐకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమ్మెట శ్రీనివాసరావు మాట్లాడుతూ.. .. లష్కర్ల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, అన్ని ఇంజినీరింగ్ విభాగాల్లో ఒకే సర్వీస్ రూల్స్ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కోశాధికారి పి.జయరామయ్య, కె.రాంబాబు, జి.రామచంద్ర, కె.శ్రీనివాసరావు, ఎన్ఆర్ఎస్‌సీ కిషోర్ పాల్గొన్నారు.

నూతన డీటీసీగా మోహన్ బాధ్యతల స్వీకరణ


మోహన్‌ను అభినందిస్తున్న రాజబాబు, నాగమురళి ఉద్యోగులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా ఉప రవాణా కమిషనర్‌గా ఎ.మోహన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ఉద్యోగులకు జరిగిన బదిలీల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లాకు ఎ.మోహన్‌ను బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తానని, ప్రమాదరహిత జిల్లాగా ఉంచడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. కొత్త వాహనాలకు సంబంధించిన దరఖాస్తులను ఎప్పటికపుడు పరిష్కరిస్తామని, శాఖాపరంగా ప్రజలు కోరుకునే సేవలను సత్వరమే అందిస్తానని తెలిపారు. డీటీసీగా బాధ్యతలు స్వీకరించిన మోహన్‌ను ఏపీ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజబాబు, ఇతర ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

పుస్తకాల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే: గత నెలలో వచ్చిన బుడమేరు వరదల్లో విద్యార్థులు అనేక మంది పుస్తకాలను పూర్తిగా కోల్పోయారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు వరద నీటిలో తడిచి ఎందుకూ పనికి రాకుండా పోయాయి. సింగ్‌నగర్‌లోని శ్రీచైతన్య స్కూలు విద్యార్థులు కూడా పుస్తకాలను కోల్పోగా... పాఠశాల యాజమాన్యం స్పందించింది. జీఎం మురళీకృష్ణ చేతుల మీదుగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేయించింది. నరేంద్ర, జె.శ్రీనివాసరావు ప్రిన్సిపల్ సుమా కిరణ్ పాల్గొన్నారు.

19 మందికి జరిమానా

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై పోలీసులు కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగర వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 19 మందిపై 5వ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ అధికారులు కేసులు నమోదు చేశారు. వారిని న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా.. 8 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున, మిగిలిన 11 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి లెనిన్‌బాబు తీర్పు చెప్పారు.

ఉచిత ఇసుక విధానాన్ని తక్షణమే అమలు చేయండి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానాన్ని తక్షణమే అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ధర్నా చౌక్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. నాలుగు నెలలుగా ఇసుక దొరక్క, ఉపాధి లేక, భవన నిర్మాణ కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు నిర్మించుకోలేక, చిన్నపాటి మరమ్మతులు కూడా చేయించుకోలేక పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రకటించిన తరువాత వారానికి ఒక రోజు.. అది కూడా అర్ధరాత్రి లైన్లు వదులుతున్నారని తెలిపారు. గతంలో రూ.4వేలు, రూ.5 వేలకే ట్రాక్టర్ ఇసుక వచ్చేదని, ఇప్పుడు ఉచిత ఇసుక పోయి అంతకంటే ధర రెట్టింపు అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఉచిత ఇసుక హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రెండు వారాల్లో అందరికీ ఇసుక అందుబాటులోకి తేవాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు మాట్లాడుతూ.. అందరికీ ఉచిత ఇసుక ఇస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వంద రోజులు దాటినా హామీ అమలు చేయడం లేదని అన్నారు. నాయకులు తులసీదాస్, వి.వెంకటేశ్వర్లు, సుబ్బరావమ్మ, మాల్యాద్రి, భాస్కరయ్య, ఎన్.సి.హెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు.



ధర్నాలో నాయకులు శ్రీనివాసరావు, బాబూరావు, తులసీదాస్, వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ కార్మికులు

ఆటల్లో విద్యార్థుల ప్రతిభ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: చుట్టుగుంట మారుతీనగర్‌లోని నారాయణ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని ప్రిన్సిపల్ ఫాజిల్ హుస్సేన్ తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి ఆంధ్రా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జరిగే అంతర్ జిల్లాల అండర్-14 క్రికెట్ జట్టులో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎ.మైఖేల్ స్థానం సాధించగా.. ఆరో తరగతి చదువుతున్న పి.గీతిక ఈ నెల 2వ తేదీన మైలవరంలో జరిగిన జిల్లా స్థాయి చదరంగ పోటీల్లో అండర్-13 కేటగిరీలో తలపడి రజత పతకాన్ని సొంతం చేసుకోవడం ద్వారా వచ్చే నెల శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించిందని పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను ఏజీఎం విజయ, క్లస్టర్ ప్రిన్సిపల్ రవిప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి అలంకారం శ్రీ అన్నపూర్ణా దేవి

5-10-2024, శనివారం



ఉర్వీ సర్వ జయేశ్వరీ జయకరీ మాతాకృపాసాగరీ నారీ నీలసమాన కుంతలధరీ నిత్యాన్నదానేశ్వరీ సాక్షాన్ మోక్షకరీ సదా శుభకరీ కాశీ పురాధీశ్వరీ భిక్షాందేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ॥

చేతిలో రసపాత్రను ధరించి, పరమేశ్వరునికి భిక్ష పెడుతున్న భంగిమలో అన్నపూర్ణాదేవి భక్తులకు దర్శనమిస్తుంది. సకల చరాచర సృష్టికి ప్రాణాధారమైన అన్నం ఈ తల్లి దయవల్లనే లభిస్తుంది. అందుకే అన్నం పరబ్రహ్మ స్వరూపం అని పెద్దలు చెబుతారు. ఈ రూపంలో ఆది పరాశక్తిని అర్చిస్తే బుద్ధివికాసం, సమయ స్ఫూర్తి, బుద్ధి కుశలత, వాక్‌సిద్ధి, శుద్ధి కలుగుతాయి. మానవుడ్ని సంపూర్ణుడిగా ఈ తల్లి అనుగ్రహిస్తుంది. అమ్మ ధరించిన అక్షయపాత్ర సకల శుభాలను అందిస్తుంది. బిడ్డల ఆకలి తీర్చడానికి ఆదిపరాశక్తి స్వయంగా అన్నపూర్ణాదేవిగా రావడం ఈ అవతార విశేషం. పరిపూర్ణమైన చిత్తంతో ఆరాధించిన వారి సమస్తపోషణా భారాన్ని ఈమె స్వయంగా వహిస్తుంది. ఓం శ్రీం హ్రీం క్లీం నమో భగవత్యన్నపూర్ణేశి మమాభిలషిత మహిదేవ్యన్నం స్వాహా అనే మంత్రాన్ని జపించి అమ్మకు నివేదన చేయాలి. తెల్లని వస్త్రాలు ధరించి, తెల్లని పుష్పాలతో పూజించాలి. అన్నపూర్ణ స్తోత్రాలు చదవాలి. భోజనశాలలో ఈ తల్లి చిత్రపటం ఉంచి, హారతులు ఇవ్వాలి.

మధురం.. మనోహరం

దుర్గమ్మ లడ్డూ అత్యంత ప్రీతిపాత్రం




విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారి నేతి లడ్డూ ప్రసాదం అంటే భక్తులకు అత్యంత ప్రియం. తిరుపతి నేతి లడ్డూ తర్వాత ఆస్థాయిలో భక్తులు భారీగా కొనుగోలు చేసేది దుర్గమ్మ ప్రసాదాన్నే. ఏటా దసరా శరన్నవరాత్రోత్సవాల్లో 20 లక్షలకు పైగా లడ్డూలను భక్తులు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. ఈ ఏడాది కూడా అక్టోబరు 03 నుంచి 12 వరకు జరుగుతున్న దసరా ఉత్సవాల్లో అమ్మవారి ప్రసాదాన్ని భారీగా తయారుచేస్తున్నారు. తొమ్మిది రోజుల దసరా వేడుకలు, ఆ తర్వాత రెండు రోజులు భవానీ దీక్షాదారుల రాక సందర్భంగా మొత్తం 25 లక్షల లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేస్తున్నారు.

– ఈనాడు, అమరావతి, – న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

రుచిలో ఏమాత్రం తేడా లేకుండా..

అమ్మవారి నేతి లడ్డూ తయారీకి ప్రధానంగా ఉపయోగించే శనగపిండిని సొంతంగా దేవస్థానం ఆధ్వర్యంలోనే తయారుచేస్తారు. నాణ్యమైన శనగపప్పును కొనుగోలు చేసి దానిని మిల్లులో ఆడించి సొంతంగా పిండిని సిద్ధం చేస్తారు. ఈ పిండిని నీటిలో ముద్దగా కలిపి నేతిలో వేయించి బూందీ తయారుచేస్తారు. ఇందుకు నాణ్యమైన విజయ డెయిరీ నెయ్యిని వినియోగిస్తారు. ఆ తర్వాత పంచదార పాకంలో ఈ బూందీని వేసి కొంత సమయం నానబెడతారు. బూందీ పాకంలో నాని.. ఉబ్బిన తర్వాత.. దానిలో యాలకుల పొడి, జీడిపప్పు, కిస్మిస్‌ను కలుపుతారు. జీడిపప్పును కలిపే ముందు నేతిలో దోరగా వేయిస్తారు. ఆ తర్వాత బాగా కలిపి లడ్డూ పోటులు సిద్ధం చేస్తారు. దానిలో పచ్చ కర్పూరం సరిపోనంత వేస్తారు. లడ్డూకు మంచి వాసన రావడంతోపాటు ఎక్కువ రోజులు పాడవకుండా ఉండేందుకు పచ్చ కర్పూరాన్ని కలుపుతారు. ఈ మొత్తం ప్రక్రియలో ఎక్కడా ఎలాంటి మార్పు లేకుండా లడ్డూ నాణ్యత, రుచి ఒకేలా ఉండేలా ఏడాది పొడవునా తయారుచేయడం గొప్ప విషయం.




లడ్డూ ప్రసాదం 80, 400 గ్రాముల్లో రెండు రకాలుగా తయారుచేస్తుంటారు. ఈ లడ్డూల తయారీలో సుశిక్షితులైన 250 మందికి పైగా సిబ్బంది పాల్గొంటారు. ప్రసాదం పోటు తయారీ దగ్గర నుంచి లడ్డూలను చుట్టే వరకూ ప్రతి దశలో చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. లడ్డూ పోటును తయారుచేశాక పెద్ద పెద్ద ట్రేలో ఉంచి.. దానిపై చిన్న పంచదార పటిక ముక్కలు వేసి.. ఆ తర్వాత ఉండలుగా చుట్టి.. ప్యాకింగ్ చేస్తారు. సాధారణ కౌంటర్లలో విక్రయించే లడ్డూలు 80 గ్రాములు, ప్రత్యేకంగా పూజలు, ప్రముఖులకు ఇవ్వడానికి 400 గ్రాముల లడ్డూలను సిద్ధం చేస్తున్నారు.

100 కిలోల పిండికి.. 5,640 లడ్డూలు..

- ★ శనగపిండి: 100 కిలోలు
- ★ పంచదార: 200 ”
- ★ నెయ్యి: 60 ”
- ★ జీడిపప్పు: 7.5 ”
- ★ కిస్మిస్: 5 ”
- ★ యాలకుల పొడి: 750 గ్రాములు
- ★ పచ్చ కర్పూరం: 150 ”
- ★ లడ్డూ బరువు: 80 ”

దసరా ఏర్పాట్లు బాగున్నాయి

చిట్టినగర్, న్యూస్‌టుడే : దసరా ఏర్పాట్లు చాలా బాగున్నాయని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం గాయత్రీదేవి రూపంలో ఉన్న అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. చిన్న చిన్న లోపాలుంటే పరిష్కరించేలా అధికారులు దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అమ్మవారు ముఖ్యమంత్రి చంద్రబాబుకు శక్తిని ప్రసాదించాలని వేడుకున్నట్లు చెప్పారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అమ్మవారిని దర్శించుకున్నారు.



మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

ఆస్పత్రుల్లో సహాయకులకు నైపుణ్య శిక్షణ

ఈనాడు, అమరావతి: ఆస్పత్రుల్లో రోగుల పడకల వద్ద సహాయకులుగా పని చేసే వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శ్రీసత్యసాయి సేవా ట్రస్టుతో ఒప్పందం కుదుర్చుకుంది. తాడేపల్లిలోని నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఈ ఒప్పందం జరిగింది. దీని ప్రకారం పదో తరగతి ఉత్తీర్ణులు, ఇంటర్మీడియట్, అండర్ గ్రాడ్యుయేట్ చదువు మధ్యలో నిలిపివేసిన వారు, నిరుద్యోగ యువతకు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. ఆన్ జాబ్ శిక్షణతో కలిపి మొత్తం ఐదు నెలలు ఈ కోర్సు ఉంటుంది. శిక్షణ పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఒప్పందం కుదుర్చుకునే కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా ట్రస్ట్ ట్రస్టీ జి.సాయి విశ్వనాథం, ఏపీఎస్ఎస్‌డీసీ ఈడీ దినేష్‌కుమార్, నర్సింగ్ నైపుణ్యాభివృద్ధి అధికారి రేహనాఖాన్ పాల్గొన్నారు.

‘ఆ జీఓను వెనక్కు తీసుకోవాలి’

ఈనాడు, అమరావతి: ఎసైన్డ్ భూముల్లో ఇసుక తవ్వుకోవడానికి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓను వెనక్కి తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వం పేదలకిచ్చిన ఎసైన్డ్ భూముల్లో మైనింగ్ తవ్వరాదని, ఆక్వా సాగు చేయకూడదని.. పేదలు, వారి కుటుంబాలు తరతరాలుగా ఆ భూమిని అనుభవించాలని చట్టం చెబుతోందని పేర్కొన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించి రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయం దళితులు, పేదలకు వ్యతిరేకమైందని, ఇప్పటికే లక్షల ఎకరాల పేదల భూములను పెత్తందార్లు దౌర్జన్యంగా, అక్రమంగా అనుభవిస్తున్నారని ఆరోపించారు.

పన్నెండోసారి బెంగళూరుకు జగన్

ఈనాడు, అమరావతి: మాజీ సీఎం, వైకాపా అధ్యక్షుడు జగన్ శుక్రవారం మరోసారి బెంగళూరుకు వెళ్లారు. గత నెల 28న బెంగళూరుకు వెళ్లిన ఆయన మంగళవారం తిరిగొచ్చారు. మూడు రోజులకే మళ్లీ అక్కడికే పయనమయ్యారు. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక జగన్ బెంగళూరుకు వెళ్లడం ఇది 12వ సారికావడం గమనార్హం.



ఫలితాలను తీసుకొచ్చేది పని మాత్రమే

మీరు బలంగా కోరుకున్నంత మాత్రాన ఏదీ మీకు దక్కదు. విద్య, సామర్థ్యాల్లాంటి అర్హతలు ఉన్నంత మాత్రాన ఏవీ వచ్చి మీ ఒళ్లో వాలవు. అమోఘమైన తెలివితేటలు మీకున్నా అన్నీ మీ దరి చేరవు. మీరు వేటి కోసమైతే నిజంగా కష్టపడి పనిచేస్తారో అవి మాత్రమే మిమ్మల్ని వరిస్తాయి. ఫలితాలను తీసుకొచ్చేది ఆశలు, ఆకాంక్షలు కాదు.. అంకితభావంతో స్థిరంగా పనిచేసే గుణమే.

– కోరీ విల్సన్, బిజినెస్ కన్సల్టెంట్

ఉన్నత విద్యలో ఆన్‌లైన్ పరీక్షల విధానం

- విశ్వవిద్యాలయాల్లో ఆన్‌లైన్‌లోనే ప్రశ్నపత్రాల రూపకల్పన
- కంప్యూటర్‌లో జవాబుపత్రాల మూల్యాంకనం
- మార్కులు ట్యాంపరింగ్ చేయకుండా పారదర్శకతకు ప్రభుత్వం చర్యలు

ఈనాడు, అమరావతి: విశ్వవిద్యాలయాల్లో పరీక్షల విధానాన్ని కంప్యూటరీకరణ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డిగ్రీ, పీజీ పరీక్షల ఫలితాల్లో పారదర్శకత, మార్కుల్లో కచ్చితత్వం, పరీక్షల నిర్వహణను పటిష్ఠం చేసేందుకు ఈ విధానాన్ని తెస్తోంది. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ‘సమగ్ర పరీక్షల నిర్వహణ విధానం’ అమలు చేయనుంది. గతంలో కాగ్ సైతం ప్రశ్నపత్రాల మూల్యాంకనంలో లోపాలు ఉన్నట్లు బహిర్గతం చేసింది. మొదట పరీక్షల్లో తప్పినా, పునర్ మూల్యాంకనంతో ఉత్తీర్ణులవుతున్న వారి సంఖ్య కొన్ని వర్సిటీల్లో 40% వరకు ఉంటోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో గతంలో బీఈడీలో 52 మంది పునర్ మూల్యాంకనానికి దరఖాస్తు చేస్తే వీరిలో 30 మంది మార్కులు మారాయి. పీజీలో ఒక కోర్సుకు 80 మంది దరఖాస్తు చేస్తే 52 మందికి మార్కులు పెరిగాయి. ఆంధ్ర, ఆదికవి నన్నయ, ఎస్వీ యూనివర్సిటీల్లో పునర్ మూల్యాంకనం బాగోలేదని గతంలో కాగ్ హెచ్చరించింది. విశ్వవిద్యాలయాల్లో పరీక్షల నిర్వహణ విభాగానికి, ఇతర విభాగాలకు మధ్య సమన్వయం లేదు. గతంలో నాగార్జున వర్సిటీలో కొన్ని బీఈడీ కళాశాలలకు ప్రవేశాలకు అనుమతులు లేకపోయినా పరీక్షల విభాగం పరీక్షలు నిర్వహించి, ఫలితాలు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. వర్సిటీల్లో ఇలాంటి పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నాలు మొదలయ్యాయి.

ఆన్‌లైన్ మూల్యాంకనం..

కొత్తగా తెచ్చే సంస్కరణల్లో భాగంగా ప్రశ్నపత్రాల మూల్యాంకనాన్ని ఆన్‌లైన్ చేయనున్నారు. పరీక్షలు పూర్తయ్యాక జవాబుపత్రాలను స్కానింగ్ చేస్తారు. అభ్యర్థి పేరు లేకుండా వీటికి కోడ్ కేటాయిస్తారు. అనంతరం వీటికి పాస్‌వర్డ్ పెడతారు. వర్సిటీల్లో ఈ విభాగం చూసే అధికారులు జవాబుపత్రాలను మూల్యాంకనం కోసం ఆన్‌లైన్‌లోనే అధ్యాపకులకు పంపిస్తారు. వారు కంప్యూటర్‌లోనే మూల్యాంకనం చేసి, సబ్మిట్ చేయగానే సంబంధిత అధికారికి ఇవి వస్తాయి.

★ మార్కులు రాగానే ఆటోమేటిగ్గా ఆయా వర్సిటీల లోగో, నమూనాతో మెమోల్లోకి ఈ మార్కులు వచ్చేస్తాయి. వీటిని డిజి లాకర్‌కు అనుసంధానిస్తారు. అభ్యర్థులు తమ మార్కుల మెమోలను డిజి లాకర్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

★ పునర్ మూల్యాంకనానికి దరఖాస్తు చేసేవారికి అవసరమైతే వారు రాసిన జవాబుపత్రాలను అందించే అవకాశం ఉంటుంది. మూల్యాంకనం సైతం తొందరగా పూర్తవుతుంది. ఏటా అన్ని వర్సిటీల పరిధిలో 8 లక్షల మంది పరీక్షలు రాస్తున్నారు.

ప్రశ్నల బ్యాంకు ఏర్పాటు

ప్రశ్నపత్రాలనూ కంప్యూటర్ ద్వారానే రూపొందిస్తారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలబ్యాంకును ఏర్పాటు చేస్తారు. వాటిలో నుంచి ఆన్‌లైన్‌లోనే ప్రశ్నపత్రం రూపొందిస్తారు. ప్రశ్నపత్రాలను ఆన్‌లైన్‌లో పంపించాలని భావిస్తున్నా క్షేత్రస్థాయి పరిస్థితుల కారణంగా మొదట్లో కొంతకాలం ముద్రించిన ప్రశ్నపత్రాలను పంపాలని నిర్ణయించారు. ప్రశ్నపత్రాలను ముద్రించడం, వాటిని సరఫరా చేయడం లాంటివి లేకుండా పరీక్షకు 15 నిమిషాల ముందు ప్రశ్నపత్రాన్ని ఆన్‌లైన్‌లో పాస్‌వర్డ్‌తో పంపించి, వాటిని ప్రింట్లు తీసుకొని, అభ్యర్థులకు ఇచ్చే విధానంపై ఆలోచన చేస్తున్నారు.

★ వర్సిటీల్లో పరీక్షల విభాగం కంప్యూటరీకరణ ప్రక్రియ కోసం ప్రైవేటు సాఫ్ట్‌వేర్ సంస్థలను ఎంపిక చేసేందుకు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా ఉన్నత విద్యాశాఖ టెండర్లు పిలిచింది. ఈ నెల 15 వరకు బిడ్లు స్వీకరిస్తుంది. సంస్థలను ఎంపిక చేశాక ఉన్నత విద్యాశాఖ వర్సిటీలకు కేటాయించనుంది.

కర్ణాటకలో లేని ప్రైవేటీకరణ విశాఖలో ఎందుకు?

- ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలి
- సీపీఐ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల. చిత్రంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

ఈనాడు డిజిటల్, అమరావతి: కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి తన రాష్ట్రంలోని మూతపడిన ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించుకున్నారని, 23 మంది ఎంపీలు ఉన్నా.. ఎన్డీయే ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఎందుకు అడ్డుకోవడంలేదని వక్తలు ప్రశ్నించారు. పదేళ్లుగా రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా భాజపాకే మద్దతిచ్చాయని, ఒక్క విభజన హామీని అమలు చేయకున్నా ఊడిగం చేశాయని మండిపడ్డారు. విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నేతలతో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయిస్తే అదే లాభాల్లోకి వస్తుందని అన్నారు. ప్రైవేటీకరణ ఆలోచన మానుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి లేఖ అందించాలని నిర్ణయించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల మాట్లాడుతూ.. ‘ప్రస్తుతం భాజపా కేంద్రంలో అధికారంలో ఉండటానికి కారణం తెదేపా ఎంపీలే. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వారు ఎందుకు మాట్లాడటంలేదు. కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు చేస్తోందని ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి అంటున్నారు. కానీ అవి చేసేది భాజపానే. యూపీఏ అధికారంలో ఉన్నన్ని రోజులూ ఫ్యాక్టరీ లాభాల్లోనే ఉంది. భాజపా అధికారంలోకి వచ్చాకే అప్పుల పాలైంది’ అని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. ‘ప్రైవేటీకరణ చేయాలనేది రాజకీయ నిర్ణయం. 10 ఏళ్లుగా ఆందోళనలు చేస్తున్నా.. ప్రైవేటీకరణే మా విధానమని నేరుగా చెబుతున్నారు. ప్రతిపక్ష నేతలుగా మాట్లాడే హక్కు మాకుంది. రాజకీయ పార్టీలు, నాయకులు, విద్యార్థులు, మేధావులు దీనిపై మాట్లాడాలి. భాజపా నాయకులు ప్రైవేటీకరణ చేస్తామని చెబుతుంటే తెదేపా, జనసేన పార్టీలు మాత్రం రోజుకో మాట మాట్లాడుతున్నాయి’ అని మండిపడ్డారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ‘విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయిస్తే ఏటా రూ.3వేల కోట్ల లాభాలు ఆర్జిస్తుంది. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలోని మర్లపాడులో సుమారు 1,300 ఎకరాల్లోని గనులను జిందాల్ కంపెనీకి కేటాయించారు. వాటిని విశాఖ ఉక్కు పరిశ్రమకు కేటాయించాలి’ అని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ‘ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అందుకే ప్లాంట్‌కు రావాల్సిన గనులను తొలగిస్తోంది. ప్రైవేటీకరణ చేసి అదానీకి అప్పజెప్పాలని చూస్తోంది’ అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నర్సింగరావు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తునకు సహకరించండి

- వైకాపా నేత సజ్జలకు హైకోర్టు ఆదేశం
- ముందస్తు బెయిలు పిటిషన్‌పై విచారణ 25కు వాయిదా

ఈనాడు, అమరావతి: తెదేపా కేంద్ర కార్యాలయంపై మూకుమ్మడి దాడి కేసులో దర్యాప్తునకు సహకరించాలని వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డిని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 25కు వాయిదా వేసింది. అప్పటి వరకు ఆయన అరెస్టు విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టంచేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు. తెదేపా కార్యాలయంపై దాడి కేసులో తనను నిందితుడిగా చేర్చారని, వాస్తవానికి ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని, ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ సజ్జల రామకృష్ణారెడ్డి హైకోర్టులో వ్యాజ్యం వేసిన విషయం తెలిసిందే. సజ్జల రామకృష్ణారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. తెదేపా కార్యాలయంపై దాడి ఘటన రోజున పిటిషనర్ పోరుమామిళ్లలో, ఘటనా స్థలానికి 600 కి.మీ దూరంలో ఉన్నారని కోర్టుకు నివేదించారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, పీపీ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు.

దాడి ఘటన రోజు సజ్జల రామకృష్ణారెడ్డి తాడేపల్లి వైకాపా కార్యాలయంలో ఉన్నట్లు ఇద్దరు సహ నిందితులు, ఇద్దరు సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారని తెలిపారు. దేవినేని అవినాష్ అనుచరుడు, ఈ కేసులో 13వ నిందితుడు షేక్ సైదా ఇచ్చిన వాంగ్మూలంలో ఆ రోజు సాయంత్రం 3 గంటలకు వైకాపా కార్యాలయంలో పిటిషనర్‌ను చూసినట్లు వెల్లడించారన్నారు. సజ్జల ప్రోద్బలంతోనే దాడి చేసినట్లు షేక్ సైదా చెప్పారని తెలిపారు. దాడి ఘటనలో సజ్జల రామకృష్ణారెడ్డి పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభించాయని పేర్కొన్నారు.

నందిగం సురేష్‌కు షరతులతో బెయిలు

దర్యాప్తునకు అందుబాటులో ఉండాలన్న హైకోర్టు

ఈనాడు, అమరావతి: తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్, వైకాపా సానుభూతిపరుడు అవుతు శ్రీనివాసరెడ్డిలకు హైకోర్టు షరతులతో కూడిన రెగ్యులర్ బెయిలు మంజూరు చేసింది. మంగళగిరి మొదటి తరగతి అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో రూ.15వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. అభియోగపత్రం దాఖలు చేసేవరకూ ప్రతి నెలా 1, 15వ తేదీల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు ఏదో ఒక సమయంలో దర్యాప్తు అధికారి (ఐఓ) ముందు హాజరుకావాలని ఇద్దరినీ ఆదేశించింది. దర్యాప్తు నిమిత్తం పోలీసులు కావాలన్నప్పుడల్లా అందుబాటులో ఉండాలని పిటిషనర్లకు తేల్చిచెప్పింది. ఈ కేసులో ఎవరినీ ప్రలోభపెట్టడం, బెదిరించడం చేయవద్దని ఆదేశించింది. ఇలాంటి నేర ఘటనలను పునరావృతం చేయవద్దని స్పష్టం చేసింది. దిగువ కోర్టులో విచారణ ప్రక్రియలో పాల్గొనాలని పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం ఈ మేరకు తీర్పు చెప్పారు.

★ పోలీసులకు నందిగం సురేష్ మొబైల్ ఫోన్లను అప్పగించకపోవడాన్ని దర్యాప్తునకు సహకరించనట్లుగా చెప్పలేమని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. పిటిషనర్లను సెప్టెంబరు 4న అరెస్టు చేశారని, నెల రోజులుగా జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారని గుర్తుచేశారు. పోలీసు కస్టడీ పూర్తయిందన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని బెయిలు మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

ఏఆర్ డెయిరీ ఎండీ ముందస్తు బెయిలు పిటిషన్ 17కు వాయిదా

ఈనాడు, అమరావతి: ఏఆర్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ ఆర్.రాజశేఖరన్ హైకోర్టులో దాఖలు చేసిన ముందస్తు బెయిలు పిటిషన్‌పై విచారణ ఈ నెల 17కు వాయిదా పడింది. శ్రీవారి లడ్డూ తయారీకి జంతువుల కొవ్వుతో కల్తీ చేసిన నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణలతో తనపై తిరుపతి తూర్పు ఠాణాలో సెప్టెంబరు 25న నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిలు మంజూరుచేయాలని రాజశేఖరన్ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. శుక్రవారం నాటి విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. లడ్డూ విషయమై సుప్రీంకోర్టులో చోటుచేసుకున్న పరిణామం నేపథ్యంలో తమ పిటిషన్‌ను ఈ నెల 17కు వాయిదా వేయాలని కోరారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ విచారణను వాయిదా వేశారు.